aruhi
aruhi group
BBTV
BBTV TELUGU
BBTVNETWORK

తెలుగు దినపత్రిక

నమస్తే
# మహాప్రభ
ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

శనివారం
07-03-2026 సంపుటి : 01 సంచిక : 36 పేజీలు : 08 వెల : ₹5/- RNI NO : TGTEL/26/A0738

BESQATI
besqati.com
Contact : info@besqati.com

Published From HYDERABAD,VIJAYAWADA తెలంగాణ , ఆంధ్రప్రదేశ్. www.mahaaprabha.com MAHAAPRABHA.DAILY

# సివిల్స్‌లో మెరిసిన తెలుగుతేజాలు

- 30 మంది ఎంపిక
- పెద్దపల్లికి చెందిన సృజనకు 55వ ర్యాంకు
- ఫలితాలు విడుదల చేసిన యుపిఎస్‌సి
- అనుజ్ అగ్నిహోత్రికి మొదటి ర్యాంకు

న్యూఢిల్లీ మార్చి 6 (మహాప్రభ ).
అఖిల భారత సివిల్ సర్వీసెస్ పరీక్ష 2025 ఫలితాల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులు సత్తా చాటారు. ఈ పరీక్షల్లో మొత్తం 958 మంది అభ్యర్థులు అర్హత సాధించగా..వారిలో కనీసం 30 మంది తెలుగువారే ఉన్నారు. ఈ ఫలితాలను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యుపిఎస్‌సి) శుక్రవారం ప్రకటించింది. రాజస్థాన్‌కు చెందిన ఎంబిబిఎస్ గ్రాడ్యుయేట్ అనుజ్ అగ్నిహోత్రి మొదటి ర్యాంకు సాధించారు. తమిళనాడుకు చెందిన రాజేశ్వరి సువే రెండో ర్యాంక్ సాధించారు. రాజేశ్వరి తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వంలో డిప్యూటీ కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

-మిగతా 3 లో







## రాష్ట్రంలో ఏప్రిల్ నుంచి ఎస్ఐఆర్


- ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సీఈవోకు కేంద్రం ఎన్నికల సంఘం ఆదేశాలు




## భారత్‌కు వచ్చేస్తాం.. సాయం చేయండి

- గల్ఫ్‌లో చిక్కుకున్న 12వేల మంది భారతీయుల అభ్యర్థన

## పాక్‌లో కొవిడ్ తరహా ఆంక్షలు!..




# మూసీ ప్రక్షాళన చేసి తీరుతాం

## అభివృద్ధి చేస్తుంటే గుంపులుగా అడ్డుకుంటున్నారు

- రంగారెడ్డి జిల్లాను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దుతా : సీఎం ఎ.రేవంత్‌రెడ్డి
- శంషాబాద్‌లో అతిపెద్ద రైల్వేస్టేషన్‌కు అనుమతులు
- త్వరలో అక్కడి నుంచే బుల్లెట్ రైలు ప్రయాణం
- మూసీ, రేడియల్ రోడ్డు బాధితులకు అండగా ఉంటాం
- శంషాబాద్‌లో ఏకోపార్క్ ప్రారంభించిన సీఎం
- రేడియల్ రోడ్డు పనులకు శిలాఫలకం

శంషాబాద్ మార్చి 6 (మహాప్రభ ).
మూసీ ప్రక్షాళన చేసి తీరుతామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తుంటే.. కొందరు గుంపులుగా అడ్డుకుంటున్నారని అన్నారు. రంగారెడ్డి జిల్లాను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండల పరిధిలోని హిమాయత్‌సాగర్ వద్ద 85 ఎకరాల విస్తీర్ణంలో రూ.75 కోట్లతో నిర్మించిన ఏకో పార్కు టూరిజం కేంద్రాన్ని ప్రారంభించారు. అలాగే బుద్వేల్ నుంచి నాచారం వరకు రూ.488 కోట్లతో 250 ఫీట్ల వెడల్పుతో నిర్మించనున్న నేషనల్ హైవే 167 రేడియల్ రోడ్డు-2 పనులనూ ప్రారంభించారు. అనంతరం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ అధ్యక్షతన జరిగిన

-మిగతా 3 లో



## భారత కుబేరుల్లో ముకేశ్ నం.1

2లో




# కర్ణాటక ప్రభుత్వం సంచలన నిర్ణయం

- 16ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియా బ్యాన్
- అసెంబ్లీ సమావేశాల్లో ప్రకటించిన సీఎం సిద్ధరామయ్య
- దేశంలోనే తొలి రాష్ట్రం..

న్యూఢీల్లి మార్చి 6 (మహాప్రభ ).
కర్ణాటక ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. 16ఏళ్లలోపు పిల్లల సోషల్ మీడియా వాడకంపై నిషేధం విధించింది. ఈ మేరకు కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య శుక్రవారం అసెంబ్లీ సమావేశాల్లో ప్రకటించారు. సిద్ధరామయ్య మాట్లాడుతూ.. పెరుగుతున్న మొబైల్ వినియోగం వల్ల పిల్లలపై పడుతున్న ప్రతికూల ప్రభావాలను అరికట్టడమే ఈ నిర్ణయానికి ముఖ్య ఉద్దేశం అని అన్నారు.పిల్లల్లో సోషల్ మీడియా వినియోగాన్ని నియంత్రించాలనే అంశంపై కర్ణాటక ప్రభుత్వం గత కొంతకాలంగా చర్చలు జరుపుతోంది. సీఎం సిద్ధరామయ్య గత నెలలో ప్రభుత్వ విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్స్ లర్లతో జరిపిన చర్చల్లో ఈ అంశాన్ని లేవనెత్తారు. పిల్లలకు సోషల్ మీడియా బ్యాన్‌కు

-మిగతా 3 లో



# ఇండియాపై యుద్ధం ఎఫెక్ట్..

- ఎల్ఎన్‌జీ గ్యాస్ సరఫరాను నిలిపివేసిన ఖతర్
- 40శాతం సప్లయ్ బంద్
- కెనడా, ఆస్ట్రేలియాలతో కేంద్రం చర్చలు

న్యూఢీల్లి మార్చి 6 (మహాప్రభ ).
ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య వార్ ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో గ్యాస్ ధరలు భారీగా పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. యుద్ధం కారణంగా లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ (ఎల్ఎన్‌జీ) సరఫరా భారీగా తగ్గింది. వాస్తవానికి.. భారత ప్రభుత్వం గ్యాస్ అవసరాలకోసం పూర్తిగా మిడిల్ ఈస్ట్ దేశాలపై ఆధారపడుతుంది. ప్రస్తుతం ఇరాన్- అమెరికా యుద్ధం కారణంగా ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉండడంతో ఇతర దేశాలతో సంప్రదింపులు మొదలు పెట్టింది. ఓవైపు సరఫరాలో కోత పడగా మరోవైపు స్పాట్ మార్కెట్లో కూడా దొరికే పరిస్థితి లేకపోవడంతో ప్రాధాన్యత రంగాలపై ప్రతికూల ప్రభావం పడుతోందని గ్యాస్ సరఫరా దిగ్గజం గెయిల్ సీఎండీకి సీజీడీ సంస్థల సమాఖ్య ఏసీఈ లేఖ రాసింది. గృహాలు, సీఎన్‌జీ కస్టమర్లు, చిన్న పరిశ్రమలకు

-మిగతా 3 లో

## నేపాల్ ఎన్నికల్లో కొత్త పార్టీ ప్రభంజనం







### ఇరాన్‌కు ట్రంప్
# వార్నింగ్

- శాంతి చర్చలు లేవ్..
- షరతులు లేకుండా లొంగిపోవాల్సిందే..



న్యూఢీల్లి మార్చి 6 (మహాప్రభ ).
అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం తీవ్రమవుతున్న వేళ అమెరికా ఇరాన్‌కు మరో కీలక హెచ్చరిక జారీ చేసింది. ఎలాంటి షరతులు లేకుండా ఇరాన్ తమ ముందు లొంగిపోవాల్సిందేనని, అంతవరకు ఎలాంటి ఒప్పందం లేదని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వార్నింగ్ ఇచ్చాడు. ఈ మేరకు తన ట్రూత్ సోషల్ మీడియాలో ట్రంప్ శుక్రవారం ఈ ప్రకటన చేశాడు.

-మిగతా 3 లో

# ఇరాన్ భీకరపోరు

## ఇజ్రాయిల్, అమెరికన్ స్థావరాలపై క్షిపణుల వర్షం

- గల్ఫ్ దేశాల పైనా విరుచుకుపడిన టెహ్రాన్
- లెబనాన్‌లో ఇజ్రాయిల్‌ను అడ్డుకుంటున్న హిజ్బొల్లా
- టెహ్రాన్, బీరుట్‌పై భారీగా ఇజ్రాయిల్ బాంబు దాడులు

న్యూఢీల్లి మార్చి 6 (మహాప్రభ ).
మధ్యప్రాచ్యంలో నివసిస్తున్న ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా పోతోంది. వరుసగా ఏడో రోజు కూడా భీకర పోరు సాగింది. రక్షణ వ్యవస్థలే లక్ష్యంగా ఇరాన్ వైపు నుంచి ఇజ్రాయిల్ పైకి క్షిపణులు దూసుకొచ్చాయి. దీంతో ప్రజలకు మొబైల్ ఫోన్ల ద్వారా అత్యవసర హెచ్చరికలు జారీ చేశారు. సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని సూచించారు. అటు గల్ఫ్ దేశాలపైకూడా ఇరాన్ దాడులు కొనసాగుతున్నాయి. దుబాయిపై క్షిపణి దాడులు జరిగే అవకాశాలు ఉండడంతో ప్రజలను అప్రమత్తం చేశారు.

-మిగతా 3 లో



# ఇరాన్‌తో యుద్ధం.. రోజుకు రూ.8,000 కోట్లు ఖర్చు చేస్తున్న అమెరికా

**న్యూఢిల్లీ మార్చి 6 (మహాప్రభ ).**
ఏ రెండు దేశాల మధ్య యుద్ధమైనా.. ఎవరు గెలిచినా, ఎవరు ఓడినా ఇరువైపులా భారీ నష్టం ఉంటుంది. అందులోనూ యుద్ధం కోసం భారీగా నిధులు ఖర్చు చేయాలి. యుద్ధాల కారణంగా కొన్ని దేశాలు ఆర్థికంగా చితికిపోయాయి కూడా. ఇప్పుడు ఇదంతా ఎందుకూ అంటే ప్రస్తుతం జరుగుతున్న ఇరాన్ యుద్ధం కోసం అమెరికా భారీగా ఖర్చు పెడుతున్నట్లు పలు నివేదికలు చెబుతున్నాయి. దీనికి సంబంధించి అధికారిక సమాచారం బయటకు రాదు.కానీ, అమెరికాలోని వాషింగ్టన్‌కు చెందిన సెంటర్ ఫర్ స్ట్రాటజిక్ అండ్ ఇంటర్నేషనల్ స్టడీస్ (సీఎస్ఐఎస్) అనే సంస్థ నివేదిక ప్రకారం అమెరికరా ఈ యుద్ధం కోసం భారీగా ఖర్చు చేస్తోంది. శుక్రవారం నాటికి ఇరాన్‌తో యుద్ధం ప్రారంభమై వారం రోజులు అవుతోంది. ఇన్ని రోజులు యుద్ధంపై చేసిన



ఖర్చుపై అంచనాల్ని ఈ నివేదిక వెల్లడించింది. యుద్ధం మొదలైన మొదటి 100 గంటల్లోనే అమెరికా 3.7 బిలియన్ డాలర్లు ఖర్చు చేసింది. అలాగే ఈ వారం రోజులపాటు సగటున రోజుకు 900 మిలియన్ డాలర్లు ఖర్చైంది. అంటే మన కరెన్సీలో రోజుకు రూ.8,300 కోట్ల వరకు ఖర్చవుతోంది. ఇప్పటికే వాడిన ఆయుధాల స్థానంలో కొత్తవి రూపొందించేందుకు భారీగా ఖర్చవుతుంది. అదనంగా 3.1 బిలియన్ డాలర్లు అవసరం. రోజుకు 758 మిలియన్ డాలర్ల విలువైన ఆయుధాల్ని యుద్ధంలో వినియోగిస్తున్నారు. ఫైటర్ విమానాల కోసం కూడా భారీగా ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఈ ఖర్చు రక్షణ శాఖకు కేటాయించిన బడ్జెట్‌కు అదనం. అంటే ఈ నిధుల కోసం అమెరికా రక్షణ శాఖ మళ్లీ నిధుల్ని అడగాల్సి ఉంటుంది. దీనికి అమెరికన్ కాంగ్రెస్ ఆమోదం తెలపాలి. అయితే, ఇది అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు రాజకీయంగా ఇబ్బందులు తెచ్చిపెట్టొచ్చు. అదనంగా నిధులు కోరితే ప్రతిపక్షం వ్యతిరేకించవచ్చు. కానీ, నిధులు లేకపోతే యుద్ధాన్ని కొనసాగించడం కూడా కష్టమవుతుంది. ఇప్పటికే అమెరికా ప్రజల్లో ద్రవ్యోల్బణం, ధరల పెరుగుదల, చమురు ధరల పెరుగుదల, జీవన వ్యయం పెరగడం వంటి వాటిపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ పరిణామాలు ట్రంప్‌కు ఇబ్బందిగా మారొచ్చనేది విశ్లేషకుల అంచనా.

# జపాన్‌లో 60 శాతం మంది పెళ్లికాని యువత పిల్లలు వద్దనుకుంటున్నారు!



**టోక్యో:మార్చి 6 (మహాప్రభ ).**
జపాన్‌లో పెళ్లి కాని వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. 30 ఏళ్ల లోపు ఉన్న 60 శాతం మంది పెళ్లికాని యువత పిల్లలు వద్దనుకుంటున్నారు. తాజాగా నిర్వహించిన సర్వేలో ఈ విషయం వెల్లడైంది. ఆర్థిక ఇబ్బందులు, కెరీర్‌పై ఫోకస్ వల్ల పిల్లలు కనేందుకు ఇష్టపడడం లేదని తెలిసింది. ఆ దేశ ప్రఖ్యాత ఫార్మసీ కంపెనీ ఇటీవల ఈ సర్వే చేపట్టింది. ఆన్‌లైన్ ద్వారా రోటో ఫార్మసీ కంపెనీ ఈ సర్వే నిర్వహించింది. 18 నుంచి 29 ఏళ్ల మధ్య వయసున్న పెళ్లి కాని మహిళలు, పురుషుల నుంచి గత ఏడాది డిసెంబర్‌లో సర్వే వివరాలు సేకరించారు. ప్రెగ్నెన్సీ, ఫ్యామిలీ ప్లానింగ్‌లో భాగంగా ఆ ఫార్మసీ కంపెనీ ఈ సర్వే చేపట్టింది. పిల్లలు కనేందుకు ఇష్టపడని వారి సంఖ్య 2025లో 62.6 శాతానికి చేరుకున్నట్లు ఆ సర్వే వెల్లడించింది. అయితే 2020 నాటి సర్వేతో పోలిస్తే ఆ సంఖ్య 18 శాతం పెరిగినట్లు అంచనా వేశారు.

# ఎల్పీజీ ఉత్పత్తిని పెంచండి..

రిఫైనరీలకు కేంద్రం ఆదేశం



**న్యూఢిల్లీ మార్చి 6 (మహాప్రభ ).**
పశ్చిమాసియాలో ఉద్రిక్తతల వేళ వంట గ్యాస్ లభ్యతపై కేంద్రం కీలక చర్యలు చేపట్టింది. ఎల్పీజీ ఉత్పత్తిని పెంచాలని రిఫైనరీలను ఆదేశించింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరో రెండు వారాలు కొనసాగితే బ్యారెల్ ముడి చమురు ధర 150 డాలర్లకు పెరిగి ఆర్థిక సంక్షోభం తలెత్తవచ్చని ఖతార్ పెట్రోలియం మంత్రి సాద్ ఆల్ కాబీ హెచ్చరించారు.మరోవైపు, పశ్చిమాసియాలోని అమెరికా స్థావరాలు, ఆస్తులపై మాత్రమే తాము దాడులు చేస్తున్నామని ఇరాన్ విదేశాంగ సహాయ మంత్రి సయ్యద్ ఖతీబ్జాదే తెలిపారు. తమ దాడులతో అరబ్ దేశాల్లో ఎలాంటి ప్రాణనష్టం జరుగలేదన్నారు. ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ మేరకు వెల్లడించారు. ఇదిలా ఉండగా ఉద్రిక్తతల వేళ తమ పౌరులకు దుబాయ్‌లోని అధికారులు మొబైల్ అలర్ట్ మెసేజీలు పంపించారు. ఇండ్ల నుంచి బయటకు రావొద్దని, అత్యవసర సమయాల్లో సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించారు.


# అనిల్ అంబానీ 'రిలయన్స్ పవర్'పై ఈడీ దాడులు




**ముంబయి న్యూఢిల్లీ మార్చి 6 (మహాప్రభ ).**
: రిలయన్స్ ఏడీఏజీ గ్రూప్ చైర్మన్ అనిల్ అంబానీ రిలయన్స్ పవర్‌తో పాటు దాని అనుబంధ సంస్థలపై శుక్రవారం ఉదయం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు ఏకకాలంలో దాడులు చేపట్టారు. ముంబయితోపాటు దేశంలోని పలు ప్రాంతాల్లో సోదాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. నగదు అక్రమ చలామణి కేసులో భాగంగా .... ఈ తనిఖీలు జరుగుతున్నట్లుగా నేషనల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఫారిన్ ఎక్స్ఛేంజ్ మేనేజ్‌మెంట్ యాక్ట్ నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఈడీ ఈ చర్యలు చేపట్టింది. రిలయన్స్ పవర్‌కు చెందిన కొన్ని ఆర్థిక లావాదేవీల్లో అక్రమాలు జరిగినట్లుగా అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే అధికారులు కొన్ని కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. సోదాల అనంతరం ఈడీ అధికారిక ప్రకటన విడుదల చేసే అవకాశం ఉంది. ముఖ్యంగా అనిల్ అంబానీకి అత్యంత సన్నిహితంగా ఉండే వ్యక్తులు, రిలయన్స్ పవర్‌తో సంబంధం ఉన్న డైరెక్టర్ల నివాసాలు, కార్యాలయాల్లో అధికారుల రెయిడ్స్ కొనసాగుతున్నాయి. గతంలో కూడా 'పండోరా పేపర్స్' లీక్, ఇతర ఆర్థిక లావాదేవీల కేసుల్లో అనిల్ అంబానీ ఈడీ ముందు హాజరై విచారణను ఎదుర్కొన్న సంగతి విదితమే.

# పాక్‌లో కొవిడ్ తరహా ఆంక్షలు!..

ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోం, విద్యార్థులకు ఆన్‌లైన్ క్లాసులు!!




**ఇస్లామాబాద్, మార్చి 6 (మహాప్రభ ).**
అమెరికా-ఇరాన్ యుద్ధం సెగ పాకిస్థాన్‌ను కూడా తాకింది. హొర్ముజ్ జల సంధిని మూసివేయడంతో పాకిస్థాన్‌కు జరగాల్సిన చమురు దిగుమతులు నిలిచిపోయే ప్రమాదం ఏర్పడింది. ఇప్పటికే తీవ్ర నగదు కొరతతో కునారిల్లుతున్న పాకిస్థాన్.. దేశంలో నెలకొనబోయే చమురు కొరతను తలచుకుని ఉలిక్కిపడుతున్నది. ఇస్లామాబాద్, మార్చి 5: అమెరికా-ఇరాన్ యుద్ధం సెగ పాకిస్థాన్‌ను కూడా తాకింది. హొర్ముజ్ జల సంధిని మూసివేయడంతో పాకిస్థాన్‌కు జరగాల్సిన చమురు దిగుమతులు నిలిచిపోయే ప్రమాదం ఏర్పడింది. ఇప్పటికే తీవ్ర నగదు కొరతతో కునారిల్లుతున్న పాకిస్థాన్.. దేశంలో నెలకొనబోయే చమురు కొరతను తలచుకుని ఉలిక్కిపడుతున్నది.

# ఇరాన్‌లో భూగర్భ క్షిపణి నగరాలు

-అవే లక్ష్యంగా అమెరికా, ఇజ్రాయిల్ దాడులు
-ఏకంగా 6వేల క్షిపణులు ఉన్నాయని అంచనా

**టెహ్రాన్ న్యూఢిల్లీ మార్చి 6 (మహాప్రభ ).**
అమెరికా, ఇజ్రాయెల్ దాడుల నుంచి తన ఆయుధ సంపత్తిని కాపాడుకునేందుకు ఇరాన్ వ్యూహాత్మకంగా నిర్మించుకున్న భూగర్భ క్షిపణి నగరాలు ఇప్పుడు ఆ దేశానికే ప్రతికూలంగా మారుతున్నాయి. అమెరికా, ఇజ్రాయిల్ ఏకపక్ష యుద్ధం తర్వాత భారీ భూగర్భ బంకర్ల నుంచి బయటకు వస్తున్న క్షిపణి లాంచర్లనే లక్ష్యంగా చేసుకుని అమెరికా, ఇజ్రాయిల్ బాంబులతో విరుచుకుపడుతున్నాయి.

**అమెరికా టార్గెట్?**
ఇరాన్ దశాబ్దాలుగా ఎంతో పకడ్బందీగా నిర్మించుకున్న భూగర్భ బంకర్లు ఇప్పుడు అమెరికా, ఇజ్రాయెల్ దాడులకు ప్రధాన లక్ష్యంగా మారాయి. తమ వద్ద ఉన్న అతిపెద్ద భూగర్భ కేంద్రాన్ని ప్రపంచానికి చూపిస్తూ 2025 మార్చిలో ఇరాన్ ఓ వీడియోను విడుదల చేసింది. కిటికీలు లేని పొడవైన భూగర్భ కారిడార్లలో క్షిపణులను



మోసుకెళ్లే ట్రక్కులను ఆ దేశ సీనియర్ కమాండర్లు పరిశీలిస్తున్న దశ్యాలు అందులో ఉన్నాయి. ఆ వీడియో ఎక్కడ తీశారన్నది మాత్రం అప్పట్లో గోప్యంగా ఉంచారు. ఇప్పుడు ఆ ఆయుధాగారాలే ఇరాన్‌కు అతిపెద్ద సవాలుగా మారాయి.

**ఇరాన్‌ను తక్కువ అంచనా వేయలేం!**
ఇజ్రాయిల్, అమెరికా దాడుల నుంచి రక్షించుకునేందుకు యుద్ధం ప్రారంభం కావడానికి ముందే ఇరాన్ అప్రమత్తమైంది. కొన్ని క్షిపణులను, లాంచర్లను బంకర్ల నుంచి బయటకు తరలించి ఉండవచ్చని, తద్వారా వాటిని చెదరగొట్టి దాడుల నుంచి రక్షించుకోవాలని భావించినట్టు తెలుస్తోంది. ఇరాన్‌కు ఉన్న భారీ భూగర్భ స్థావరాలను పూర్తిగా ధ్వంసం చేసే బంకర్-బస్టింగ్ బాంబులు అమెరికా ఆయుధాగారంలో పరిమితంగానే ఉన్నాయి. అందుకే, లాంచర్లు బయటకు రాగానే ప్రవేశ ద్వారాల వద్దే ధ్వంసం చేసే వ్యూహాన్ని అమలు చేస్తున్నారు.
క్షిపణులను అడ్డుకునే ఎయిర్-డిఫెన్స్ ఇంటర్‌సెప్టార్ల నిల్వలు అయిపోకముందే, టెహ్రాన్ ప్రయోగ సామర్థ్యాన్ని పూర్తిగా నిర్వీర్యం చేయాలని వాషింగ్టన్ భావిస్తోంది. సుదీర్ఘకాలం సాగే యుద్ధం కోసం ఇరాన్ ఉద్దేశపూర్వకంగానే తన ఆయుధ నిల్వలను ఆదా చేసుకుంటున్నట్టు కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇరాన్ క్షిపణి నిల్వలపై భిన్నమైన అంచనాలున్నాయి. యుద్ధానికి ముందు ఇరాన్ వద్ద 2,500 క్షిపణులు ఉండొచ్చని ఇజ్రాయిల్ అంచనా వేయగా, సుమారు 6,000 వరకు ఉంటాయని స్వతంత్ర విశ్లేషకులు చెబుతున్నారు. ఇరాన్ వద్ద మిగిలి ఉన్న ఈ ఆయుధ సంపత్తే భవిష్యత్తులో ఈ యుద్ధం ఏ మలుపు తిరుగుతుందన్నది నిర్ణయించనుంది.

# భారత కుబేరుల్లో ముకేశ్ నం.1



**న్యూఢిల్లీ మార్చి 6 (మహాప్రభ ).**
ఈ ఏడాదికి గాను హురున్ విడుదల చేసిన భారత కుబేరుల జాబితాలో రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముకేశ్ అంబానీ అగ్రస్థానంలో కొనసాగారు. అంబానీ కుటుంబ సంపద గడిచిన ఏడాది కాలంలో 9 శాతం పెరిగి రూ.9.8 లక్షల కోట్లకు పెరిగిందని హురున్ రిపోర్టు వెల్లడించింది. భారత్‌తో పాటు ఆసియా సంపన్నుడు కూడా ముకేశే. ప్రపంచ రిచ్ లిస్ట్‌లో మాత్రం 17వ స్థానంలో ఉన్నారు. కాగా, భారత జాబితాలో రూ.7.5 లక్షల కోట్ల ఆస్తితో గౌతమ్ అదానీ ఫ్యామిలీ, రూ.3.2 లక్షల కోట్ల నెట్‌వర్త్‌తో హెచ్‌సీఎల్ టెక్ చైర్మన్ రోష్నీ నాడార్ కుటుంబం వరుసగా 2,3 స్థానాల్లో నిలిచారు. రోష్నీ నాడార్ మన టాప్-10 బిలియనీర్లలోని ఏకైక మహిళ కూడా. అయితే, గడిచిన ఏడాది కాలంలో అదానీ ఆస్తి 14 శాతం, నాడార్ సంపద 10 శాతం తగ్గింది. సీరమ్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన సైరస్ పూనావాలా (రూ.3 లక్షల కోట్లు), ఆదిత్య బిర్లా గ్రూప్ అధిపతి కుమార మంగళం బిర్లా (రూ.2.5 లక్షల కోట్లు) వరుసగా 4,5 స్థానాల్లో ఉన్నారు. సన్‌ఫార్మాకు చెందిన దిలీప్ సంఘ్వీ, విప్రో వ్యవస్థాపకులు అజీమ్ ప్రేమ్‌జీ, నీరజ్ బజాజ్ కుటుంబం, ఆశోక్ హిందుజా ఫ్యామిలీ, డీమార్ట్ వ్యవస్థాపకులు రాధాకిషన్ దమానీ వరుసగా 6 నుంచి 10 వరకు స్థానాలను దక్కించుకున్నారు. జూఈ ఏడాది భారత్‌లోని మొత్తం బిలియనీర్ల సంఖ్య 308కు చేరుకుంది. 2025 జాబితాతో పోలిస్తే 24 మంది పెరిగారు. వీరి మొత్తం సంపద వార్షిక ప్రాతిపదికన 10 శాతం పెరిగి రూ.112.6 లక్షల కోట్లకు చేరుకుంది.

# మరోసారి సర్‌కు వ్యతిరేకంగా సీఎం మమత ఆందోళన

**న్యూఢిల్లీ మార్చి 6 (మహాప్రభ ).**
కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన సమగ్ర ఓటర్ జాబితా సవరణ(సర్)పై మరోసారి సీఎం మమత ఆందోళన బాటపట్టింది. సర్ విధానాన్ని వ్యతిరేకిస్తూ కలకత్తాలోని ధర్మసాలలోని మంచాల ఎదుట తన పార్టీ శ్రేణులతో కలిసి నిరసన తెలిపారు. ప్రజాస్వామ్యం వ్యవస్థలో బీజేపీ ఓట్ల



సవరణ పేరుతో రిగ్గింగ్ కు పాల్పడుతుందని, ఎన్నికల వ్యవస్థను కాపాడే కేంద్ర ఎన్నికల సంఘం బీజేపీ చేతిలో కీలుబొమ్మ అయిందని సోషల్ మీడియా ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు. సరైన ఆధారాలు లేకుండా అనేక మందిని ఓటర్ జాబితా నుంచి తొలగించారని మండిపడ్డారు. తర్వలోనే బీజేపీకి బెంగాలీ ప్రజలు గుణపాఠం చెప్తుతారని హెచ్చరించారు.

## కర్ణాటక ప్రభుత్వం సంచలన నిర్ణయం

మొదటి తరువాయి



సంబంధించి వారి నుంచి అభిప్రాయాలు కోరారు. పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు, నిపుణులు, పిల్లల అభిప్రాయాలు సేకరించి తుది నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలోనే ఆయన తాజాగా 16ఏళ్లలోపు పిల్లలు సోషల్ మీడియా వాడకంపై బ్యాన్ విధిస్తూ ప్రకటన చేశారు. ఆస్ట్రేలియా గత ఏడాది డిసెంబర్ నెలలో 16ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియాను నిషేధిస్తూ చట్టం అమలు చేసింది. ఆస్ట్రేలియా కంటే ముందే.. అమెరికాలోని పలు రాష్ట్రాలు స్థానిక చట్టాల ద్వారా పిల్లలు సోషల్ మీడియా వాడకంపై నియంత్రణ చర్యలు చేపట్టాయి. అయితే, ఆస్ట్రేలియా ప్రభుత్వం స్ఫూర్తితో యూరోపియన్ యూనియన్ ఈ అంశాన్ని పరిశీలిస్తోంది. మరికొన్ని దేశాలు చిన్న పిల్లలు సోషల్ మీడియా వాడకాన్ని నిషేధించేందుకు సిద్ధమవుతున్నాయి.భారత దేశం విషయానికి వస్తే.. చిన్నారులు సోషల్ మీడియా వాడకంపై బ్యాన్ విధించేలా ఆలోచన చేస్తున్నామని ఏపీ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఆ మేరకు చర్యలు ప్రారంభించామని అన్నారు. అయితే, తాజాగా కర్ణాటక ప్రభుత్వం 16ఏళ్లలోపు చిన్నారులు సోషల్ మీడియా వాడకంపై బ్యాన్ విధిస్తూ నిర్ణయం తీసుకుంది. తద్వారా దేశంలోనే తొలి రాష్ట్రంగా నిలిచింది.

## ఇండియాపై యుద్ధం ఎఫెక్ట్..

మొదటి తరువాయి

నిరాటంకంగా గ్యాస్ సరఫరా చేసేందుకు తాము కట్టుబడి ఉన్నామని, కాకపోతే గ్యాస్ లభ్యతపై స్పష్టతనివ్వాలని కోరింది. ప్రస్తుతం ఇండియా రోజుకు 195 మిలియన్ మెట్రిక్ స్టాండర్డ్ క్యూబిక్ మీటర్స్ పర్ డే0 (ఎంఎంఎస్‌సీఎండీ) గ్యాస్ దిగుమతి చేసుకుంటుంది. ఇందులో 60 మిలియన్ ఎంఎంఎస్‌సీఎండీ ఖతర్ నుంచి వస్తోంది. ఒక్క ఖతర్ నుండే 40శాతం గ్యాస్ సరఫరా అవుతోంది. ఇరాన్ దాడులు చేయడంతో ఖతర్ ఎనర్జీకి చెందిన ఎల్‌ఎన్‌జీ కేంద్రాల్లో ఉత్పత్తి ఆగిపోయింది. ఈ కంపెనీ ఫోర్స్ మెజర్ నోటీసులు జారీ చేసింది. అంటే ఒప్పందం ప్రకారం.. గ్యాస్ సప్లయ్ చేయలేమని చేతులెత్తేసింది. ఇలాంటి సమయంలో ఇతర దేశాల నుంచి గ్యాస్ కొనడం అనివార్యమైంది. ఖతర్ చేతులెత్తేయడంతో ప్రత్యామ్నాయ వనరులపై భారత దేశం దృష్టి సారించింది. ఇప్పటికే ఆస్ట్రేలియా, కెనడా దేశాలు భారత్‌కు గ్యాస్ సరఫరా చేయడానికి ముందుకు వచ్చాయి. అలాగే కొత్త ఒప్పందాల ద్వారా యూఏఈ, అమెరికా నుంచి కూడా ఇంధన వనరులు భారత్ సమీకరిస్తోంది. అయితే, ప్రస్తుతం గ్యాస్ కొరత లేదని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

## సివిల్స్‌లో మెరిసిన తెలుగుతేజాలు

మొదటి తరువాయి

3వ ర్యాంక్‌లో హర్యానాకు చెందిన అకాన్ష్ ధూల్ నిలిచారు. ఫలితాలను యుపిఎస్‌సి.జిఓవి.ఐఎన్‌లో చూడవచ్చునని తెలిపింది. సమాచారం కోసం పనివేళల్లో 23385271, 23381125, 23098543 నంబర్లకు ఫోన్ చేయవచ్చునని తెలిపింది. కాగా, శుక్రవారం ప్రకటించిన ఫలితాల్లో తెలుగు రాష్ట్రాల నుంచి 30 మంది అభ్యర్థులు సివిల్ సర్వీసెస్‌కు ఎంపికయ్యారు. వీరిలో తెలంగాణలోని పెద్దపల్లికి చెందిన గుడెల్లి సృజన 55వ ర్యాంక్ సాధించారు. ఆ తర్వాతి స్థానాల్లో శ్రీగిరిరాజు విపిఎస్ సాయి కృష్ణ (125), కొలిపాక శ్రీకృష్ణ సాయి (150), బనోతు లక్ష్మి రచన (178), ఎస్ వర్షిత్ రెడ్డి (259), వెలిమినేటి విక్రమ్ సింహ రెడ్డి (541) ఉన్నారు. హైదరాబాద్‌లోని వివిధ కోచింగ్ సెంటర్ల సమాచారం ప్రకారం..తెలుగు రాష్ట్రాల నుంచి మొత్తం 74,427 మంది దరఖాస్తు చేసుకోగా..వారిలో 42804 మంది పరీక్ష రాశారు. వీరిలో 90 మంది ఇంటర్వ్యూ వరకు వెళ్లగా..తుది ఫలితాల్లో ఎంపిక జాబితాలో కనీసం 30 మంది చోటు దక్కించుకున్నారు. గతేడాది 54 మంది సివిల్స్‌లో సత్తా చాటారు.

## నేపాల్ ఎన్నికల్లో కొత్త పార్టీ ప్రభంజనం

భారీ విజయం దిశగా బాలేంద్ర షా పార్టీ



**ఖాట్మాండు : మార్చి 6 (మహాప్రభ ).**
నేపాల్ పార్లమెంట్ ఎన్నికల్లో ఆశ్చర్యకరమైన ఫలితాలు వెలువడ్డాయి. ఆ దేశంలో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో జెన్-జి మద్దతున్న రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ (ఆర్‌ఎస్‌పి) విజయం దిశగా వెళ్తోంది. గురువారం పోలింగ్ ముగియగా.. శుక్రవారం ఉదయం నుంచి ఓట్ల లెక్కింపు మొదలైంది. ఇప్పటి వరకూ వెలువడిన ఫలితాల ప్రకారం.. బాలేంద్ర షా నాయకత్వంలోని ఆర్‌ఎస్పీ మెజార్టీ స్థానాల్లో విజయం వైపు దూసుకెళ్తోంది. ఆ పార్టీ మొత్తం 110 స్థానాల్లో ముందంజలో ఉంది. నేపాలీ కాంగ్రెస్, ఇతర పార్టీలు ప్రభావాన్ని చూపట్టలేకపోయాయి. కాంగ్రెస్ ఒక స్థానంలో గెలిచి, 10 చోట్ల ఆధిక్యంలో ఉంది. కమ్యూనిస్టు అభ్యర్థులు ఏడు చోట్ల ఆధిక్యంలో కొనసాగుతున్నారు. నేపాల్‌లో మొత్తం 165 స్థానాలకు జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో 67 పార్టీలు పోటీచేశాయి. గతేడాది జెన్-జి ఆందోళనలతో కెపి శర్మ ఓలీ నాయకత్వంలోని నేపాల్ ప్రభుత్వం కూలిపోయిన విషయం విదితమే. దీంతో అక్కడ ఎన్నికలు అనివార్యమయ్యాయి. నేపాల్‌లో 275 మంది సభ్యులున్న ప్రతినిధుల సభలో 165 మంది సభ్యులు ఎఫ్‌పిటిపి వ్యవస్థ ద్వారా ఎన్నికవుతారు. 110 సీట్లు దామాషా ప్రాతినిధ్య వ్యవస్థ ద్వారా భర్తీ అవుతాయి. ఈ నెల 9 నాటికి ఎన్నికల కౌంటింగ్ పూర్తవుతుందని ఆ దేశ ఎన్నికల కమిషన్ వెల్లడించింది.

# మూసీ ప్రక్షాళన చేసి తీరుతాం

మొదటి తరువాయి

సమావేశంలో సీఎం మాట్లాడారు. హైదరాబాద్ నగరానికి చారిత్రక నేపథ్యం ఉందని గుర్తు చేశారు. చార్మినార్, గోల్కొండ, మక్కా మసీద్, ఉస్మానియా ఆస్పత్రి, ఉస్మానియా కాలేజ్‌తోపాటు అనేక అద్భుత నిర్మాణాలు ఉన్నాయన్నారు. హిమాయత్ సాగర్ వద్ద నిర్మించిన ఏకో పార్కు అద్భుతమైనదని తెలిపారు. వినోదం, ఆహ్లాదం కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లి రావాల్సిన అవసరం లేకుండా.. ఇక్కడే వివిధ ప్రాంతాల ప్రజలు వచ్చి ఈ ప్రాంతాన్ని సందర్శించే విధంగా అద్భుతంగా తీర్చిదిద్దామని అన్నారు. పర్యాటక కేంద్రంగా హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో నిర్మించి సామాన్యులకు, అన్ని వర్గాలకూ అందుబాటులో ఉండే విధంగా అన్ని రకాల పర్యావరణహితమైన సౌకర్యాలతో ఏర్పాటు చేశామని తెలిపారు. పెద్ద నిర్మాణమైనా దాని నిర్వహణ సరిగ్గా లేకపోతే.. త్వరలోనే పాడవుతుందని అన్నారు. నాటి నైజాం వరదల నివారణ కోసం నిర్మించిన గొప్ప చారిత్రాత్మకమైన మూసీ.. నేడు మురికి కుంపగా మారిందని తెలిపారు. గత పాలకులు దాన్ని పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. మూసీ రివర్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో మూసీ నదిని సుందరంగా తీర్చిదిద్దడానికి ప్రణాళిక రూపొందించి, అభివృద్ధి చేయడానికి ప్రయత్నిస్తుంటే.. బీఆర్‌ఎస్ నాయకులు గుంపులు గుంపులుగా అడ్డుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 40ఏండ్ల పాటు వారి కుటుంబం అధికారంలో ఉండి ఈ ప్రాంతంలో ప్రజల



అభివృద్ధిని అడ్డుకోవడం ఓ మాజీ మంత్రికే చెల్లిందని అన్నారు.

**మూసీ, రేడియల్ రోడ్డు బాధితులను ఆదుకుంటాం**

రంగారెడ్డి జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం చేపడుతున్న కార్యక్రమంలో భాగంగా మూసీ రివర్ ఫ్రంట్‌లో కొంతమంది భూములు కోల్పోతున్నారని, అపార్ట్‌మెంట్లు, రేడియల్ రోడ్డు కింద భూములు కోల్పోతున్న వారికి అండగా ఉంటామని సీఎం హామీ ఇచ్చారు. గత ప్రభుత్వాల మాదిరి వాళ్ళను రోడ్డుకు వదిలేసే పరిస్థితి లేదని, మెరుగైన నష్టపరిహారం ఇచ్చి భవిష్యత్తులో మరోచోట భూములు కొనుక్కునే విధంగా ఆదుకుంటామని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ సూచన మేరకు ఎక్కడైతే భూములు కోల్పోతారో అక్కడే అదే ప్రాంతంలో డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలన్న ఆలోచన ప్రభుత్వం చేస్తోందన్నారు. ఐదేండ్లలో రంగారెడ్డి జిల్లా రూపు రేఖలు పూర్తిగా మారిపోతాయని స్పష్టం చేశారు. శంషాబాద్‌లో అతిపెద్ద రైల్వే స్టేషన్ నిర్మాణంతో ఇక్కడి నుండే బుల్లెట్ రైలు వెళ్తుందని, దానికి కావాల్సిన అనుమతులు వచ్చాయని తెలిపారు.

బహదూర్‌గూడలో మెట్రో స్టేషన్ ఏర్పాటు జరుగుతుందని, రేడియల్ రోడ్డుతో రంగారెడ్డి జిల్లా వివిధ ప్రాంతాలు పూర్తిగా అభివృద్ధి చెందుతాయని అన్నారు. శంషాబాద్‌తోపాటు షాబాద్‌లోని చందనవెల్లి పారిశ్రామికవాడ, సీతారాంపూర్ పరిశ్రమ, కావాలాచర్ల పారిశ్రామిక వాడను లింకు చేస్తూ రూ.488కోట్లతో 81 కిలో మీటర్ల రేడియల్ రోడ్డు నిర్మాణం చేపట్టామని అన్నారు. మూసీ రివర్ ప్రక్షాళనతో మురుగు ప్రక్షాళన జరగడమే కాకుండా.. 24 గంటల పాటు వ్యాపారాలు, ఉపాధి జరిగే విధంగా కార్యక్రమాన్ని రూపొందించి, ముందుకు వెళ్తున్నామని అన్నారు. ఈ నెల 8 నుంచి 'ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక' కార్యక్రమం 99 రోజులపాటు జరుగుతుందని, ప్రజలు భాగస్వాములై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎంపీలు కొండ విశ్వేశ్వర్‌రెడ్డి, డాక్టర్ మల్లు రవి, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, చల్ల నర్సింహారెడ్డి, జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇరాన్ భీకరపోరు

మొదటి తరువాయి

టెహ్రాన్‌పై ప్రయోగించిన రెండు డ్రోన్లను ఇరాన్ సైన్యం కూల్చివేసింది. జోర్డాన్‌లోని ఇర్బిత్ నగరంపై ఇరాన్ డ్రోన్ల దాడి చేసింది. వీటిలో అనేక డ్రోన్లను జోర్డాన్ గగనతల రక్షణ వ్యవస్థ అడ్డుకొంది. రియాద్‌కు తూర్పు వైపున ఇరాన్ ప్రయోగించిన మూడు డ్రోన్లను కూల్చివేశామని సౌదీ అరేబియా చెప్పింది. కాగా ఇజ్రాయిల్ వాణిజ్య కేంద్రం టెల్ అవీవ్‌లో శుక్రవారం అనేక పేలుడు శబ్దాలు విన్పించాయి. ఇరాన్ తాజాగా ప్రయోగించిన క్షిపణులను కనుగొన్నామని ఇజ్రాయిల్ తెలిపింది. ఇజ్రాయిల్, అమెరికా సేనల దాడిలో ఇరాన్‌లో 3,600కు పైగా నివాస గృహాలు, వాణిజ్య-సేవా కేంద్రాలు, మందుల దుకాణాలు దెబ్బతిన్నాయని రెడ్‌క్రాస్ చెప్పింది. రెడ్ క్రిసెంట్‌కు చెందిన తొమ్మిది భవనాలకు కూడా నష్టం వాటిల్లింది. మరోవైపు హెజ్బొల్లా కూడా దాడులను తీవ్రతరం చేసింది. దక్షిణ లెబనాన్‌లోని ఖియామ్ పట్టణం వైపు వస్తున్న ఇజ్రాయిల్ సైనిక వాహనాలపై దాడి చేసింది. పశ్చిమాసియాలో సైనిక, ఆర్థిక మౌలిక సదుపాయాలను ధ్వంసం చేస్తామని ఇరాన్ హెచ్చరికలు జారీ చేసింది. ఈ యుద్ధం ఆర్థిక మార్కెట్లను కుదిపివేసిందని చెప్పింది. కాగా అమెరికా, ఇజ్రాయిల్‌లతో యుద్ధం మొదలైన తర్వాత మొదటిసారిగా ఇరాన్ ప్రజలు పెద్ద ఎత్తున టెహ్రాన్‌లోనూ, దేశంలోని వివిధ ప్రాంతాలలోనూ శుక్రవారం ప్రార్థనలు జరిపారు. అటు ఇజ్రాయిల్, అమెరికా సేనలు ఇరాన్‌పై దాడులను ఉధృతం చేశాయి. ఇరాన్ రాజధాని టెహ్రాన్, లెబనాన్ రాజధాని బీరుట్‌పై బాంబుల వర్షాన్ని కురిపించాయి. షిరాజ్ నగరంలోని నివాస ప్రాంతంపై జరిగిన దాడిలో 20 మంది మరణించగా 30 మంది గాయపడ్డారు. సెంట్రల్ టెహ్రాన్‌లో ఇరాన్ సైన్యానికి చెందిన మిలిటరీ అకాడెమీపై దాడి జరిగినట్లు తెలుస్తోంది. గురువారం రాత్రి ఇరాన్ ప్రయోగించిన ఆరు బాలిస్టిక్ క్షిపణులను నేలకూల్చామని ఇజ్రాయిల్ సైన్యం తెలిపింది. లెబనాన్ రాజధాని బీరుట్ దక్షిణ శివారు ప్రాంతాలలోని హెజ్బుల్లా స్థావరాలను లక్ష్యంగా చేసుకొని ఇజ్రాయిల్ సైన్యం కనీసం 11 వైమానిక దాడులు జరిపింది. కాగా ఇరాన్‌కు చెందిన డ్రోన్ వాహక నౌకపై అమెరికా దాడి చేసినట్లు సమాచారం. తమ సైన్యం తొలి దశ పోరులో శత్రువులను ఆశ్చర్యకరమైన దెబ్బ తీసిందని, తదుపరి దశలో మరిన్ని ఆశ్చర్యకరమైన ఘటనలు జరగబోతున్నాయని ఇజ్రాయిల్ రక్షణ దళాల అధిపతి లెఫ్టినెంట్ జనరల్ ఇయాల్ జమీర్ తెలిపారు. ఇరాన్ గగనతల రక్షణ వ్యవస్థలను, క్షిపణి లాంచర్లను పెద్ద ఎత్తున నష్టపరిచామని ఇజ్రాయిల్ సైన్యం తెలిపింది. టెహ్రాన్‌పై దాడులను ఉధృతం చేస్తామని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్‌సేథ్ హెచ్చరించారు. కాగా తన సరిహద్దు ప్రాంతంలోని విమానాశ్రయాన్ని, పాఠశాలను లక్ష్యంగా చేసుకొని ఇరాన్ దాడులు జరపడంతో ఆ దేశం నుంచి దౌత్య సిబ్బందిని వెనక్కి రప్పిస్తున్నామని అజర్‌బైజాన్ తెలిపింది.

**200 మంది చిన్నారులు బలి**

మధ్యప్రాచ్యంలో జరుగుతున్న యుద్ధం అనేక మంది చిన్నారుల ప్రాణాలను బలిగొంటోంది. ఘర్షణలు ప్రారంభమైనప్పటి నుంచి 200 మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. ఒక్క ఇరాన్‌లోనే 181 మంది చనిపోయారు. లెబనాన్‌లో ఏడుగురు, ఇజ్రాయిల్‌లో ముగ్గురు, కువైట్‌లో ఒకరు మృత్యువాత పడ్డారు.

# రాష్ట్రంలో ఏప్రిల్ నుంచి ఎస్‌ఐఆర్

-ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సీఈవోకు
కేంద్రం ఎన్నికల సంఘం ఆదేశాలు

**హైదరాబాద్, మార్చి 6 (మహాప్రభ ).**
తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రక్షాళన త్వరలోనే ప్రారంభం కానుంది. కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్‌ఐఆర్) ప్రక్రియను మన రాష్ట్రంలో ఏప్రిల్ నుంచి చేపట్టనున్నారు. ఇందుకుగాను ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారిని ఆదేశిస్తూ.. ఈసీఐ శుక్రవారం సర్క్యులర్ జారీ చేసింది. ఓటర్ల జాబితా సవరణ కోసం ఎన్నికల విభాగాలు సిద్ధం కావాలని, విధి విధానాల ప్రచారం, అవగాహన కార్యక్రమాలను ప్రక్రియ ప్రారంభం లోపు పూర్తిచేయాలని పేర్కొంది. ఏప్రిల్ నుంచి




ప్రారంభమయ్యే ఈ ప్రక్రియ కోసం శిక్షణ కార్యక్రమాలు, బూత్‌స్థాయి అధికారుల నియామకం, క్షేత్రస్థాయి మ్యాపింగ్ పనులను తక్షణమే పూర్తి చేయాలని సూచించింది. కాగా, ఓటర్ల జాబితాను వంద శాతం దోష రహితంగా మార్చడమే లక్ష్యంగా ఎస్‌ఐఆర్ పేరిట సవరణను చేపట్టనున్నారు. సాధారణ ఓటర్ల సవరణలా కాకుండా ఎస్‌ఐఆర్‌లో బూత్‌స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) నేరుగా ఓటర్ల ఇళ్లకు వస్తారు. మరణించిన వారి పేర్లు, డూప్లికేట్ ఓట్లు, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వలసవెళ్లిన వారి వివరాలను జాబితా నుంచి తొలగిస్తారు. అలాగే 18 ఏళ్లు నిండిన యువతకు కొత్తగా ఓటు హక్కు కల్పిస్తారు. ఇంటింటి సర్వే నిర్వహించి ప్రతి ఓటరు ఫొటో, చిరునామా సరిచూస్తారు. ఈ భారీ కసరత్తు కోసం అధికార యంత్రాంగం ఇప్పుడే సిద్ధంకావాలని ఈసీఐ ఆదేశించింది. ఇప్పటికే బిహార్ వంటి రాష్ట్రాల్లో మొదటి దశ పూర్తికాగా, ప్రస్తుతం 12 రాష్ట్రాల్లో రెండోదశ ఎస్‌ఐఆర్ ప్రక్రియ కొనసాగుతోంది. తెలంగాణతోపాటు నిర్దేశిత రాష్ట్రాల్లో ఏప్రిల్ నుంచి మూడోదశ ఎస్‌ఐఆర్‌ను ప్రారంభించనున్నారు.

## ఇరాన్‌కు ట్రంప్ వార్నింగ్

మొదటి తరువాయి

ఒకపక్క ఇరాన్ శాంతి చర్చలకు సిద్ధమంటూ ప్రకటించింది.
ఇతర దేశాల మధ్యవర్తిత్వానికి అంగీకరిస్తామని, అయితే, ముందుగా ఇజ్రాయెల్, అమెరికా నుంచే ఆ స్పందన రావాలని ప్రకటించింది. అంతవరకు తమ దేశ గౌరవం, సార్వభౌమాధికారం కోసం పోరాడుతామని ఇరాన్ స్పష్టం చేసింది. ఇరాన్ కాస్త తగ్గినట్లు అనిపించిన నేపథ్యంలో అమెరికా నుంచి కూడా సానుకూల స్పందన వస్తుందని అంతా అనుకున్నారు. కానీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మాత్రం ఎలాంటి మధ్యవర్తిత్వాన్ని అంగీకరించబోమన్నారు. శాంతి చర్చలు ఉండవన్నారు. ఏ షరతులు లేకుండా అమెరికాకు లొంగిపోవాల్సిందే అని ఇరాన్‌కు స్పష్టం చేశాడు. ఇలా చేస్తే ఇరాన్‌లో కొత్త నాయకత్వానికి అంగీకరిస్తామని, ఇరాన్ పునర్నిర్మాణానికి కూడా సహకరిస్తామన్నారు. మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్ నినాదంలాగా మేక్ ఇరాన్ గ్రేట్ ఎగైన్ అంటూ చెప్పారు. అమెరికాతోపాటు తమ మిత్ర దేశాలు కూడా ఈ విషయంలో సహకరిస్తాయని హామీ ఇచ్చారు. ఈ ప్రకటన ద్వారా ఇరాన్‌తో ఎలాంటి చర్చలు, శాంతి ఒప్పందానికి తాము అంగీకరించబోమని ట్రంప్ వెల్లడించారు. అంతకుముందు ట్రంప్ మీడియాతో మాట్లాడుతూ ఇరాన్ అధినేతను తామే నిర్ణయిస్తామన్నారు. మరోవైపు ఇజ్రాయెల్ కూడా ఇదే స్పష్టం చేసింది. తమ అంగీకారం లేని ఇరాన్ అధినేత ఎవరైనా హతమారుస్తామని హెచ్చరించింది. అందుకే ఇరాన్ కూడా తమ కొత్త అధినేతను ఎన్నుకోలేకపోతుంది. ఇటీవల హతమైన ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ కుమారుడిని ఎన్నుకోవాలని చూసినా, ఈ విషయంలో ఇంకా స్పష్టత లేదు.

## భారత్‌కు వచ్చేస్తాం.. సాయం చేయండి

గల్ఫ్‌లో చిక్కుకున్న 12వేల మంది భారతీయుల అభ్యర్థన



**న్యూఢిల్లీ, మార్చి 6 (మహాప్రభ ).**
అమెరికా- ఇరాన్ యుద్ధం ప్రభావంతో దాదాపు 12వేల మంది భారతీయులు గల్ఫ్ దేశాల్లో చిక్కుకుపోయారు. ఇప్పుడు వీరంతా స్వదేశానికి తిరిగి రావడానికి సాయం చేయాలని కేంద్రాన్ని కోరుతున్నారు. ఈ విషయమై ఆయా ప్రాంతాల్లోని భారత రాయబార కార్యాలయాలను సంప్రదిస్తున్నారు. ప్రధానంగా యూఏఈలో చిక్కుకున్న వారినుంచి పెద్దసంఖ్యలో అభ్యర్థనలు వస్తున్నాయి. పశ్చిమాసియాలో సైనిక ఘర్షణ నేపథ్యంలో భద్రతాపరమైన కారణాలతో అక్కడి గగనతలాన్ని చాలావరకూ మూసివేశారు. ఇక దోహాలో చిక్కుకున్న 850 మంది భారత పౌరులు సౌదీ అరేబియా వరకూ రోడ్డు మార్గంలో ప్రయాణించి రియాద్ ఎయిర్‌పోర్టు నుంచి స్వదేశానికి చేరుకున్నారు. అత్యంత రద్దీగా ఉండే దుబాయ్, అబుదాబి, దోహా విమానాశ్రయాలు మూతపడగా యూఏఈలోని ఫుజైరా నుంచి కొన్ని విమాన సర్వీసులు నడుస్తున్నాయి. యూఏఈపై ఇరాన్ దాడులు కొనసాగుతుండటంతో అక్కడ పెద్దసంఖ్యలో చిక్కుకున్న భారతీయులను తరలించడం సవాలుగా మారింది. వీరిలో చాలామంది రోడ్డు మార్గంలో ఒమన్‌లోకి ప్రవేశించి, మస్కట్ విమానాశ్రయం నుంచి భారత్ చేరుకోవడానికి ప్రయత్నిస్తున్నారు.

# సంపాదకీయం

## ఇరకాటంలో భారత్!




మనదేశం నిర్వహించిన మిలన్ 2026 నౌకాదళ విన్యాసాలకు హాజరైన 74దేశాలలో ఇరాన్ ఒకటి. విశాఖలో ఫిబ్రవరి 15 నుంచి 26వ తేదీ వరకు జరిగిన కార్యక్రమంలో పాల్గొని స్వదేశానికి పయనమైన ఐరిస్‌దేనా అనే దాని యుద్ధనౌకను శ్రీలంక సమీపంలో ఎలాంటి హెచ్చరికలు లేకుండా జలాంతర్గామి టార్పెడోతో దాడిచేసి ముంచివేసింది. ఆ నౌకలో ఉన్న 130 మంది నావికుల్లో బతికిన వారు 32మందే. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత అనేక యుద్ధాలు జరిగాయి, కానీ, ఏ ఒక్కదానిలోనూ ఇలా టార్పెడోతో మరోదేశ నౌకను ముంచిన ఉదంతం లేదు. ఈ దాడితో ఇరాన్ మీద జరుపుతున్న యుద్ధాన్ని మన ప్రధాని నరేంద్రమోడీ జిగినీదోస్తు డోనాల్డ్ ట్రంప్ మనపెరటి తోట హిందూ మహా సముద్రంలోకి తెచ్చినట్లయింది. ఇది మనకు ఆందోళన కలిగించటమే కాదు, గర్హనీయం కూడా. అయినా సరే మన ప్రధాని నోరు మెదపరు. ఖండించే ధైర్యం 56 అంగుళాల ఛాతీకి లేకపోయినా కనీసం ఈ ఉదంతం పట్ల ఎలాంటి ఆందోళన కూడా వెల్లడించకపోవటాన్ని ఏమనాలి? విశాఖలో జరిగిన విన్యాసాలకు ఇరాన్ నౌక వచ్చింది మన ఆహ్వానం మీద తప్ప యుద్ధానికి కాదు. అమెరికాను కూడా ఆహ్వానించాం, విశాఖ వచ్చిన ఇరాన్ నౌకను తిరుగు ప్రయాణంలో పేల్చివేయాలన్న దుష్ట నిర్ణయానికి ముందే వచ్చిన కారణంగానే తన నౌకలకూ అదే పరిస్థితి ఎదురు కావచ్చనే దూరాలోచనతో విశాఖకు కేవలం కొందరు అధికారులను తప్ప నౌకలను పంపలేదని తేలిపోయింది. దీన్ని మన ముసలి జేమ్స్ బాండ్ అజిత్ దోవల్ పసిగట్టి అతిధిని హెచ్చరించటంలో విఫలమైనట్లు కనిపిస్తోంది. యుద్ధాలు, ఉద్రిక్తతలు తలెత్తినపుడు శత్రుదేశాలకు చెందిన నౌకలు తమ జలాల్లోకి అనుమతి లేకుండా ప్రవేశిస్తే హెచ్చరికలు చేయటం, ఉల్లంఘిస్తే పేల్చివేతకు పాల్పడవచ్చు. కానీ, అంతర్జాతీయ జలాల్లో ఉన్నపుడు అది కూడా కొన్ని వేల కిలోమీటర్ల దూరంలో మరొక ఖండంలోని ఒక నౌకను అమెరికా పేల్చివేయటం అంతర్జాతీయ సూత్రాలకు విరుద్ధం. భారతీయ విలువలు, సాంప్రదాయాలను తాము మాత్రమే పాటిస్తున్నట్లు కాషాయ నేతలు చెప్పుకుంటారు.తమ్ముడు తనవాడైనా ధర్మం ధర్మమే అన్న సూక్తి ప్రకారం ఎవరు తప్పు చేసినా చెప్పాలా వద్దా? అందులోనూ ప్రపంచ రాజకీయాల్లో ఒక ప్రముఖ పాత్ర పోషించాలని భావిస్తున్న నేతలు పరీక్షా సమయం వచ్చినపుడు మౌనంగా ఉంటే మిగతా దేశాలు మనవైపు చూస్తాయా? మనకు అత్యంత సమీపంలోకి అమెరికా జలాంతర్గామి వచ్చి మన అతిధి నౌకను పేల్చివేయటాన్ని నిరోధించటంలో మనం ఎందుకు విఫలమయ్యాం? పరిస్థితులు తారు మారైతే ఇలా వచ్చి అలా మన మీద దాడి చేస్తే పరిస్థితి ఏమిటి? పాకిస్థాన్ జలాంతర్గాములు వచ్చినా ఇంతేనా? రెండవది తెలిసి ఉంటే మనకు ఇబ్బంది కలిగించే దాడి నివారణకు మోడీ ఎందుకు పూనుకోలేదు! ఇలా ఎన్నో అనుమానాలు, సందేహాలు. ఈ నేపథ్యంలోనే మన నౌకాకేంద్రాలను అమెరికా వినియోగించుకుంటున్నదనే ప్రచారం వైరల్ అయింది. రాచపీనుగ ఒంటరిగా పోదన్నట్లు డోనాల్డ్ ట్రంప్ సాధ్యమైనంత మందిని తనతో తీసుకుపోయేందుకు ఒక ఎత్తుగడగా శ్రీలంక వద్ద నౌకను పేల్చివేయించి ఉండవచ్చు. ఇలాంటి వాడా మనకు మిత్రుడు! మనలను ఇంకా మిత్రదేశంగానే పరిగణిస్తున్న కారణంగా ఇరాన్ సున్నితంగా "భారత నౌకాదళ అతిధి"గా వచ్చిన తమ నౌకను పేల్చివేసినట్లు వర్ణించింది. మీ వైఖరి ఏమిటో తేల్చుకోవాలి, చెప్పాలన్న అంతరార్థం కూడా దీనిలో ఇమిడి ఉంది. అమెరికా-ఇజ్రాయిల్ పన్నిన వలలో చిక్కుకోవద్దని గల్ఫ్‌దేశాలను హెచ్చరిస్తూ సౌదీ అరేబియా మీడియా సంపాదకులలో ఒకడైన అద్వాన్ ఆల్ ఆహమరీ చేసిన వ్యాఖ్యలు ఎవరికైనా వర్తిస్తాయి. భారత్ ఆతిధ్యమిచ్చిన విన్యాసాలకు హాజరై తిరిగి వెళ్తున్న నౌకను పేల్చివేయటం ద్వారా మన ఇరుగుపొరుగును యుద్ధ ప్రాంతంలోకి సమర్ధవంతంగా అమెరికా నెట్టిందని రక్షణ వ్యవహారాల నిపుణుడు బ్రహ్మ చెలానే చేసిన వ్యాఖ్యలను కొట్టిపారవేయలేము. దాడి జరిగింది మన జలాల్లో కాదు కదా మనకేం బాధ్యత ఉంటుంది అని తెలివిగా తర్కాన్ని ప్రదర్శించ వచ్చు. హిందూమహా సముద్రం మన పెరటితోట వంటిది, అక్కడ జరిగే ప్రతిపరిణామం మనల్ని ఏదో విధంగా ప్రభావితం కావిస్తుంది. అదే అమెరికా, చైనా తీరంలో అలాంటి పనులు చేస్తే అవి ఊరుకుంటాయా ? మౌనంగా ఉన్నారంటూ గత కొద్ది రోజులుగా తీవ్రమైన విమర్శలు రావటంతో నరేంద్ర మోడీ తొలిసారిగా నోరు విప్పారు. ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్‌తో కలసి గురువారం నాడు సంయుక్త పత్రికా గోష్టిలో మాట్లాడుతూ మిలిటరీ ఘర్షణలు ప్రపంచ సమస్యలను పరిష్కరించలేవంటూ సుభాషితం చెప్పారు. మంచిదే ఈ మాత్రానికి ఆ చెప్పేదేదో ఇరాన్‌పై దాడులను ప్రారంభించిన వెంటనే తానే స్వయంగా చెప్పి ఉండవచ్చు, ఒక చిన్నదేశాధినేత తోడు లేకుండా ఎందుకు మాట్లాడలేకపోయారు! అదే విధంగా హత్యకు గురైన ఖమేనికి సంతాపం తెలుపుతూ గురువారం నాడు మన విదేశాంగశాఖ ప్రతినిధి ఇరాన్ రాయబార కార్యాలయానికి వెళ్లి సంతాప పుస్తకంలో సంతకం చేసి వచ్చారు. ఇదీ అంతే, హత్యను ఖండించటానికి నోరు రాలేదు సరే, సంతాపం తెలపటానికి కూడా ఇంత తటపటాయింపా? కొంపదీసి దీనికీ అమెరికా అనుమతి కోసం ఆగారా అని ఎవరైనా అంటే తప్పుపట్టగలమా?

# అభివృద్ధి సమిష్టి గా కృషి చేయాలి






- అధికారులంతా ప్రజలతో మమేకం కావాలి
- ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా చర్యలు చేపట్టాలి
- 99 రోజుల కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వాములు చేయాలి
- రాష్ట్ర కార్మిక,ఉపాధి శిక్షణ కర్మాగారాలు గనులు మరియు భూగర్భ మంత్రి వర్యులు జిల్లా ఇంచార్జీ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి







**మెదక్ జిల్లా మార్చి 6 (మహాప్రభ ).**
జిల్లా అభివృద్ధి సమిష్టి గా కృషి చేయాలి.అధికారులంతా ప్రజలతో మమేకం కావాలని జిల్లా ఇంచార్జీ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు.రాష్ట్ర ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. 99 రోజుల కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వాములు చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. శుక్రవారం మెదక్ లోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ప్రజాపాలన -ప్రగతి ప్రణాళిక పై ఉమ్మడి మెదక్ జిల్లా అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ప్రజా పాలన కార్యక్రమం నిర్వహణలో ఉమ్మడి మెదక్ జిల్లాను మొదటి స్థానంలో ఉండేలా ప్రజలను భాగస్వామ్యం చేస్తూ ప్రజా ప్రతినిధుల సమక్షంలో ఘనంగా నిర్వహించాలన్నారు. ప్రజలతో మమేకమై వారితో కలిసి పనిచేసి నప్పుడే సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు అవకాశం ఉందని సీఎం భావించి ఈ కార్యక్రమంను తీసుకొచ్చారు దీన్ని అమలుచ్చేసే భాద్యత అధికారులదే అన్నారు. వేసవికాలంలో త్రాగునీరు సమస్యరాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకొని అవసరమైన ప్రాంతాలలో బోర్ల రిపేర్లు, ప్రత్యామ్నాయ తాగునీరు సరఫరాకు ప్రతిపదనలు పంపాలన్నారు. అసెంబ్లీలో చర్చించి త్రాగునీరు సమస్య రాకుండా కావలసిన తాత్కాలిక పనుల కోసం అనుమతులు తీసుకుంటాను అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రాణాలిక కార్యక్రమంలో భాగంగా 10 థీమ్స్ లలో రూపొందించిన కార్యక్రమాలను ఆయా శాఖల ద్వారా పకడ్బందీగా నిర్వహించాలని వాటితో పాటు 99 రోజుల ప్రణాళికను అన్ని శాఖలచే నిర్వహించాలని సూచించారు. నంగునూరు మండలం నర్మెట్టలో ఆయిల్ ఫెడ్ వారు నిర్మించిన ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీనీ ప్రారంభించేలా రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ప్రారంభించేలా చర్యలు తీసుకుంటానన్నారు.రెసిడెంటిల్ స్కూల్లలో త్రాగునీరు సమస్య తలెత్తకుండా చూడాలని, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు వారు కాలుష్య నియంత్రణ చర్యలు తీసుకునేలా వారిని మానిటర్ చెయ్యాలన్నారు. గుమ్మడిదలలో ఫైర్ స్టేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని, సోలార్ విద్యుత్తు సౌకర్యాన్ని కల్పించే సూర్య ఘర్ యోజన పథకం పై రివ్యూ చెయ్యాలన్నారు. ఏటిసిలు త్వరగా నిర్మాణం అయ్యేలా టిజీఐఐసి చర్యలు తీసుకోవలని సూచించారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో 6 గ్యారంటీలు ప్రజలకు పూర్తిగా అందేలా చూడాలని, నిర్మాణంలో ఉన్న
ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేసి లబ్ధిదారులచే గృహప్రవేశాలు చేయించాలని అన్నారు. మన దేశ అవసరాలకు మించి వరి పంట దేశంలో పండుతుందని రైతులు లబ్ధి పొందేలా 30% పంట మార్పిడి చేయించాలన్నారు. అధిక ఆదాయాన్ని సమకూర్చే ఆయిల్ ఫామ్ తోటల పెంపకాన్ని ప్రోత్సహించాలన్నారు. విద్యా, వైద్యం చాలా ముఖ్యమని పేద ప్రజలకు నాణ్యమైన విద్యా, వైద్య సేవలాందించాలన్నారు. రేషన్ కార్డ్స్, డిజిటల్ హెల్త్ కార్డ్స్ అర్హత ఉన్న పేదలందరికీ అందేలా చూడాలన్నారు.

**మెదక్ ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ..**
ప్రజల జీవన ప్రమాణాలు పెరిగేలా ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు.
దుబ్బాకలో ఆర్డీఓ కార్యాలయం ఏర్పాటు చెయ్యాలని, కొత్త మండలాల ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించాలన్నారు. ప్రతీ సంవత్సరం దేశవ్యాప్తంగా లక్షా 25 వేల మంది రోడ్డు ప్రమాదాల్లో చనిపోతున్నారు.రవాణా శాఖ డ్రైవింగ్ లైషన్స్ ఇచ్చేటప్పుడు రోడ్డు భద్రత నియమాలపై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు.
వివిధ నిర్మాణాలు, రహదారులు, పరిశ్రమలలో కాలుష్యాన్ని తగ్గించేలా చర్యలు తీసుకోవాలని, ప్లాస్టిక్ వ్యర్థాల నుండి డీజిల్ ను తీసేందుకు ముందుకు వచ్చిన స్వచ్ఛంద సంస్థకు సిద్దిపేట పట్టణంలో అర ఎకరం స్థలం కేటాయించాలని, నార్మట్టలో నిర్మించిన ఆయిల్ ఫెడ్ సూచించారు. ఎంపీ సురేష్ షట్కర్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంపై గ్రామ స్థాయిలో ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని,మహిళలకు హెల్త్ ప్రొఫైల్ చెక్ చేయాలని,వైద్య పోస్టులు భర్తీ చేయాలని,డాక్టర్లు అందుబాటులో ఉండాలన్నారు. వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను మరమ్మత్తు చేయాలన్నారు. ఎంఎల్సి చిన్నమైల్ అంజిరెడ్డి మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో డంపింగ్ యార్డ్ లు ఏర్పాటుచేయాలి. వాహనాలు అధికంగా నడిచే ప్రాంతాల్లో అండర్ పాస్ నిర్మించాలని, అపోజిట్ లో వాహనాలు వెళ్లకుండా కట్టుదిట్టంగా చర్యలు తీసుకువాలని, ఆయిల్ ఫామ్అధికంగా సాగు చేసుకునేలా రైతులను ప్రోత్సహించాలని సూచించారు.
ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో ఒపీ ఫీజులు వసూలు చేయకుండా చూడాలన్నారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలన్నారు. పాల ఉత్పత్తులు పెంచాలన్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులకు డ్యూప్యుటేషన్లు ఇవ్వోదన్నారు. శాసన సభ్యులు మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ.. జిల్లాలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ పనులు ప్రారంభించాలన్నారు. జిల్లా అభివృద్ధికి నిరంతరం కృషి చేసి అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు.
టి జి ఐ ఐ సీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ.. బసవేశ్వర ప్రాజెక్ట్ పనులు చేపట్టాలన్నారు. ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన కల్పించాలన్నారు . భూములు కోల్పోయిన వారిని ఆదుకోవాలని, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని,ఆయిల్ ఫామ్ పంటలను అభివృద్ధి చేయాలన్నారు. మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన 6 హామీలను నెరవేర్చే దిశగా పని చేస్తామన్నారు. జిల్లాలోని 2 నియోజకవర్గాలకు నోడల్ అధికారులను నియమించడం జరిగిందని అన్నారు. ఎప్పటికప్పుడు జిల్లా స్థాయిలో అధికారులను సమన్వయం చేసుకోవడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన అన్నారు. సిద్దిపేట జిల్లా కలెక్టర్ కే. హైమావతి మాట్లాడుతూ.. అధికారులతో పాటు ప్రజలు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిశీలించేందుకు ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ కార్యక్రమాన్ని ప్రణాళిక బద్దంగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. సంగారెడ్డి కలెక్టర్ ప్రవీణ్య మాట్లాడుతూ.. “99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక”లో భాగంగా నేటి నుంచి మార్చి 15వ తేదీ వరకు కొనసాగనున్న పరిశుభ్రత కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు పెండింగ్ ఫైల్స్ క్లియరెన్స్‌పై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అలాగే అధికారులు తమ తమ కార్యాలయాల్లో ఉన్న పెండింగ్ ఫైల్స్‌ను త్వరితగతిన క్లియర్ చేస్తామన్నారు. ముందుగా కలెక్టరేట్ కార్యాలయానికి విచ్చేసిన ఆయనకు మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావిణ్య, సిద్దిపేట జిల్లా కలెక్టర్, హైమావతి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ గౌరవ వందనం స్వీకరించిన మంత్రి కలెక్టరేట్ కార్యాలయంలో సమావేశానికి హాజరయ్యారు.
ఈ కార్యక్రమంలో మెదక్ ఎస్పీ శ్రీనివాస్ రావు, ,మెదక్ అదనపు కలెక్టర్లు నగేష్ ,మాధురి ,అబ్దుల్ హమీద్ ,మెదక్ మున్సిపల్ చైర్మన్ కనుగుల రాధిక, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, కౌన్సిలర్లు,జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# గ్యాస్ సిలిండర్ లీకై ఇల్లు దగ్ధం

**ఉమ్మడి వరంగల్, మార్చి 6 (మహాప్రభ ).**
వరంగల్ నగరంలోని జ్యోతిరావు పూలే నగర్ లో ఒక ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఆ కాలనీకి చెందిన సరోజన ఇంటికి తాళం వేసి కూలి పనికి వెళ్ళిన తర్వాత ఇంట్లో నుంచి పొగ రావడం గమనించారు .గ్యాస్ లీకై మంటలు చెలరేగడముతో ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. స్థానికులు ఫైర్ స్టేషన్ సమాచారం అందించాగా పోలీసులు ,ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.



## ప్రతి మహిళలకు విశ్వాసాన్ని కల్పించడం
# పోలీసు సిబ్బంది బాధ్యత

-జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్.,
- మహిళా దినోత్సవం పురస్కరించుకొని మహిళలకు ప్రత్యేక మెడికల్ క్యాంపు.





**మార్చి 06 తిరుపతి జిల్లా మహాప్రభ ప్రతినిధి**
తిరుపతి జిల్లా ఎస్పీ శ్రీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్., ఆదేశాల మేరకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు, సిబ్బంది మహిళల భద్రత మరియు సాధికారతపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాల ద్వారా మహిళలు నేటి సమాజంలో ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు, నేరాలపై అప్రమత్తంగా ఉండే విధంగా చైతన్యం కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలు, మహిళా ప్రాంగణాలు, వాణిజ్య సముదాయాలు తదితర ప్రాంతాలను సందర్శించిన మహిళా పోలీసులు మరియు పోలీసు అధికారులు మహిళలకు భద్రతకు సంబంధించిన అంశాలు, సైబర్ నేరాలు, మోసాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అత్యవసర సమయంలో సంప్రదించాల్సిన టోల్ ఫ్రీ నంబర్లపై అవగాహన కల్పించారు. మహిళలు తమ భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండి చట్టపరమైన సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే గ్రామీణ ప్రాంతాలలో రాత్రిపూట గ్రామస్తులతో సమావేశాలు నిర్వహిస్తూ సమాజంలో మహిళల భద్రతకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. పోలీసు శాఖ ఎల్లప్పుడూ మహిళల భద్రతకు కట్టుబడి ఉందని ప్రజలకు భరోసా కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా ఈరోజు జిల్లా ఎస్పీ గారి ఆదేశాలపై మహిళా డీఎస్పీ శ్రీమతి శ్రీలత గారి ఆధ్వర్యంలో తిరుపతి పోలీస్ మైదానంలో మహిళల కోసం ప్రత్యేకంగా మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ మెడికల్ క్యాంప్‌లో మహిళలకు రక్తపరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి వైద్య సలహాలు అందజేశారు. మహిళలు పెద్ద ఎత్తున ఈ మెడికల్ క్యాంప్‌లో పాల్గొని సేవలను వినియోగించుకున్నారు. అనంతరం జిల్లా ఎస్పీ శ్రీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్., గారు మహిళా పోలీసు సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడుతూ, ఇక్కడికి విచ్చేసిన డాక్టర్లు మరియు మా పోలీస్ కుటుంబ సభ్యులందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను అన్నారు. మార్చి 8వ తేదీ అంతర్జాతీయ మహిళా దినోత్సవం కావడంతో ముందస్తుగా వారాంతరంగా వివిధ కార్యక్రమాలను ఏర్పాటు చేసి జరుపుకుంటున్నామని తెలిపారు. మహిళలు నేటి సమాజంలో ప్రతి రంగంలో ముందంజలో ఉన్నారని ఎస్పీ పేర్కొన్నారు. అమ్మగా, అక్కగా, చెల్లిగా, భార్యగా కుటుంబ వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తూ, అదే సమయంలో చదువు, ఉద్యోగం, సేవా రంగాలు తదితర అన్ని విభాగాల్లో మహిళలు తమ ప్రతిభను చాటుకుంటూ సమాజ అభివృద్ధికి విశేషంగా తోడ్పడుతున్నారని అన్నారు. ప్రతి రంగంలో తమదైన శైలిలో ముందుకు సాగుతూ మహిళలు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారని ఈ సందర్భంగా తెలిపారు. సమాజంలో మహిళల భద్రత మరియు సాధికారత కోసం పోలీస్ శాఖ కీలక పాత్ర పోషిస్తోందని ఎస్పీ గారు తెలిపారు. ముఖ్యంగా పోలీస్ శాఖలో విధులు నిర్వర్తిస్తున్న మహిళా సిబ్బంది తమ ధైర్యం, నిబద్ధత, క్రమశిక్షణతో విధులను సమర్థవంతంగా నిర్వహిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని అభినందించారు. మహిళలపై జరిగే నేరాలను అరికట్టడంలో మహిళా పోలీసులు ముందుండి పనిచేయాలని, ప్రజలకు దగ్గరగా ఉండి వారి సమస్యలను తెలుసుకొని వెంటనే స్పందించే విధంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. మహిళా పోలీసు సిబ్బంది పోలీస్ శాఖకు ఒక ప్రత్యేక బలమని జిల్లా ఎస్పీ గారు పేర్కొన్నారు. ఈ ముఖ్యమైన రోజులలోనే కాకుండా నిరంతరం ఇలాంటి అవగాహన కార్యక్రమాలలో చురుకుగా పాల్గొని మహిళలలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా పనిచేయాలని సూచించారు. మహిళలు ఏ సమస్య ఎదురైనా పోలీసులను నమ్మకంగా సంప్రదించేలా విశ్వాసాన్ని కల్పించడం ప్రతి పోలీసు సిబ్బంది బాధ్యత అని జిల్లా ఎస్పీ గారు తెలిపారు. అనంతరం మహిళల సాధికారత, మహిళా భద్రతపై అవగాహన కల్పించే కార్యక్రమాలలో చురుకుగా పాల్గొని విశేష సేవలందించిన మహిళా సిబ్బందిని అభినందించి వారికి సర్టిఫికెట్లు అందజేశారు, కార్యక్రమం ముగిసిన తరువాత మహిళా పోలీసు సిబ్బందికి ప్రత్యేకంగా భోజనాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గారు మహిళా సిబ్బందితో కలిసి భోజనం చేసి వారితో ఆత్మీయంగా ముచ్చటించారు. పోలీస్ కుటుంబ సభ్యులుగా ఎల్లప్పుడూ మీకు నేను అండగా ఉంటాననే భావన కలిగేలా సిబ్బందిని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ గారి సతీమణి శ్రీమతి ఎల్. శ్రీ ఇందు హారిక గారు, ఆధనపు ఎస్పీ సతీమణి శ్రీమతి శ్రీ కీర్తి గారు మరియు శ్రీమతి శ్రీ విమలాకుమారి గారు పాల్గొన్నారు. అదనపు ఎస్పీలు శ్రీ వెంకట్రావు (పరిపాలన), శ్రీ రవిమనోహర్ ఆచారి (శాంతి భద్రతలు), శ్రీ శ్రీనివాసులు (క్రైమ్స్), పోలీస్ డాక్టర్ శ్రీమతి మాధురి గారు, సీఐడీ డీఎస్పీ హేమలత గారు, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ శ్రీ తమిమ్ అహ్మద్ గారు ,మరియు మహిళా పోలీసు సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మహిళా డిగ్రీ కళాశాలలో ప్రజా పాలన
--ప్రగతి ప్రణాళిక సదస్సు



**కరీంనగర్, మార్చి 6 (మహాప్రభ ).**
కరీంనగర్ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక అంశంపై 15 రోజుల సదస్సు ప్రారంభమైంది. కళాశాల ప్రిన్సిపల్ వరలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభమైన ఈ కార్యక్రమంలో పరిశుభ్రత, పారిశుద్ధ్యం, సంస్థాగత నిర్వహణ, రికార్డుల నిర్వహణ, పరిపాలన సామర్థ్యం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నారు.ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు దగ్గర చేయడం, సేవా పంపిణీ వ్యవస్థలను మెరుగుపరచడం, సమయపరిమితితో కూడిన సంస్థాగత బలోపేతం సాధించడం ఈ సదస్సు ప్రధాన లక్ష్యంగా ఉందని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక విజయవంతం కావడానికి తమ వంతు కృషి చేయాలని సంకల్పించారు.

## మెడికల్ కాలేజీ విద్యార్థులకు బస్సు సౌకర్యం



**మంచిర్యాల,మార్చి 6 (మహాప్రభ ).**
మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కాలేజీ విద్యార్థుల రవాణా సమస్యలను పరిష్కరించేందుకు పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ముందుకొచ్చారు. ఎంపీ లాడ్స్ నిధుల నుండి రూ.80 లక్షలు మంజూరు చేసి మూడు బస్సులను విద్యార్థుల వినియోగానికి అందజేశారు.గతంలో కాలేజీని సందర్శించిన సమయంలో విద్యార్థులు హాస్టల్‌కు వెళ్లడానికి రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై వెంటనే స్పందించిన వంశీకృష్ణ, నిధులు కేటాయించి బస్సులను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌కు సూచించారు.ఈ సందర్భంగా ఎంపీ వంశీకృష్ణ మాట్లాడుతూ, విద్యార్థులు కష్టపడి చదివి మంచిర్యాల జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి పెద్దపీట వేస్తోందని, విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కట్టుబడి ఉందని పేర్కొన్నారు. విద్య మన హక్కు... విద్యతోనే మన భవిష్యత్ అని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, అధికారులు, మెడికల్ కాలేజీ సిబ్బంది, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ లో చేరిన బిఆర్ఎస్ కౌన్సిలర్..



**మెదక్ జిల్లా మార్చి 6 (మహాప్రభ ).**
మెదక్ పట్టణంలోని 16వ వార్డు కౌన్సిలర్ అవారి రాజశేఖర్ బిఆర్ఎస్ పార్టీలోశ్రీ నుంచి మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే డాక్టర్ రోహిత్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనుల పట్ల కౌన్సిలర్లు, నాయకులు కాంగ్రెస్ పార్టీలోకి వచ్చేందుకు సానుకూలంగా ఉన్నారన్నారు. ఇందిరమ్మ రాజ్యంలోనే పేద ప్రజల బతుకులు మారుతాయన్న ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడం వల్ల ఎన్నో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. పట్టణం అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యమన్న విషయాన్ని ప్రజలు గ్రహిస్తున్నారన్నారు. రాబోయే రోజుల్లో మెదక్ పట్టణాన్ని అభివృద్ధి చేసి రూపురేఖలు మారుస్తామని అన్నారు.

## విద్యార్థులు ఉపాధ్యాయులుగా స్వయం పరిపాలన దినోత్సవం.



**మెదక్ జిల్లా మార్చి 6 (మహాప్రభ ).**
హవేలీ ఘనపూర్ మండలం జక్కన్నపేట గ్రామంలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థిని,విద్యార్థులతో శుక్రవారం స్వపరి పాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు కులకర్ణి దత్తాత్రేయ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం పాఠశాలలో విద్యార్థిని,విద్యార్థులు స్వపరి పాలన దినోత్సవాన్ని చాలా ఆనందంగా,ఉత్సాహంగా విద్య యొక్క ప్రాముఖ్యత లక్ష్యసాధన నిరంతరం పట్టుదలతో పాటు చదవాలని అన్నారు. ఈ కార్యక్రమం సందర్బంగా విద్యార్థిని,విద్యార్థులు డిఈఓ.ఎంఈఓ.హెచ్ఎం. ఉపాధ్యాయులుగా స్వపరి పాలన దినోత్సవంలో హెచ్ఎం గా శీల హర్షవర్ధన్,డిఇఓ గా కోరబోయిన ధనుష్,ఎంఈఓ గా బండకాడి రుచిల్, ఉపాధ్యాయులు,ఉపాధ్యయురాలు గా శీల చైత్ర,భయ్య వర్దిని,సుప్రియ,నిశాంత్, సాయి,వంశి తేజ, రాంప్రసాద్,ఐశ్వర్య,నిఖిల్ లు వ్యవహరించడం జరిగినది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కులకర్ణి దత్తాత్రేయ,పాఠశాల సిబ్బంది ఏ.అశోక్,ఏ భాస్కర్,డి. శీతల్ సింగ్,దయానంద్,సత్య నారాయణ,కృష్ణ,శృతి లు పాల్గొన్నారు.అనంతరం విద్యార్థిని,విద్యార్థులకు ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ప్రధానం చేయడమైనది.

## యూరియా కోసం రైతుల ధర్నా



**దేవరకొండ మార్చి 6 ( మహాప్రభ )**
దేవరకొండ డివిజన్ లోని చింతపల్లి మండలంలో యూరియా కొరతను నిరసిస్తూ రైతులు ధర్నా చేపట్టారు, గంటల తరబడి క్యూలో నిలుచున్న ఎరువులు దొరకడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, ఆన్లైన్ పోర్టల్ ప్రారంభమైన కొద్ది నిమిషాలలోనే నిలువలు అయిపోతున్నాయని, పంటల సమయానికి యూరియా అందక సాగు పనులు దెబ్బతింటాయని, పంటలు చేతికి రావని రైతులు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు . అధికారులు వెంటనే స్పందించి సరిపడా స్టాక్ అందుబాటులోకి తెచ్చి రైతులకు పంపిణీ చేయాలని వారు రోడ్డుపై బఠాయించి ధర్నాకు దిగారు

## తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం ప్రధాన కార్యదర్శి మల్కాజిగిరి దయానంద్ అన్న జన్మదిన వేడుకలు.



**మాల్కాజిగిరి మార్చి 6 (మహాప్రభ ).**
తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘ ప్రధాన కార్యదర్శి మల్కాజిగిరి దయానంద్ ఈరోజు మల్కాజిగిరి డివిజన్లో కార్యకర్తలు, యువకులు కలిసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. ఈ జన్మదిన కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు, ఆదాల గణేష్ , ఎరుకొండ రాములు , కొండాపురం శ్రవణ్ కుమార్ , బసవపురం మల్లేశ్ , సంఘం లడ్డు, బసవపురం శివ తదితరులు ఈ జన్మ దిన వేడుకలు పాల్గొన్నారు

## నారాయణ స్కూల్లో ఎస్.యల్.సి స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్

**మంచిర్యాల, మార్చి 6 (మహాప్రభ ).**
మంచిర్యాల జిల్లా కేంద్రంలో రాంనగర్ లోని నారాయణ హై స్కూల్లో ఎస్.ఎల్.సి. ప్రోగ్రాం చాలా ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నారాయణ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ జనరల్ మేనేజర్ గోపాల్ రెడ్డి, డీజీఎం వెంకటరమణ రెడ్డి, ఏజీఎం చైతన్య రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా పిల్లలను ఉద్దేశించి పాఠశాల ప్రిన్సిపల్ స్రవంతి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు.



ఈ కార్యక్రమంలో విద్యార్థులు వాళ్ళ తల్లిదండ్రులతో కలిసి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఈ కిడ్స్ ఆర్ డ డి సంగీత, ఈ కిడ్స్ కో ఆర్డినేటర్ రవళిప్రియ పాల్గొని ప్రోగ్రాం యొక్క ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో జోనల్ అనాలసిస్ట్ రాజేందర్, కుమ్మరి, ఈ కిడ్స్ వైస్ ప్రిన్సిపాల్ స్రవంతి, అకాడమిక్ డీన్ వెంకటస్వామి, ఇతర ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నార్కెట్‌పల్లి మండల కేంద్రంలో హనుమాన్ ట్రాక్టర్ టిల్లర్ షాప్ ప్రారంభం



**నార్కెట్‌పల్లి మార్చి 6 (మహాప్రభ ).**
నల్గొండ జిల్లా నార్కెట్‌పల్లి మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన హనుమాన్ ట్రాక్టర్ టిల్లర్ షాప్ ను నకిరేకల్ శాశనసభ్యులు వేముల వీరేశం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా షాప్ యజమానులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ ఎమ్మెల్యే వేముల వీరేశం రైతులకు అవసరమైన వ్యవసాయ యంత్రాలు స్థానికంగా సులభంగా అందుబాటులో ఉండటం ఎంతో అవసరమని తెలిపారు. ట్రాక్టర్లు, టిల్లర్లు వంటి ఆధునిక వ్యవసాయ పరికరాలు రైతులకు అందుబాటులోకి రావడం వల్ల వ్యవసాయ పనులు త్వరగా, సులభంగా పూర్తి చేసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. అలాగే ఇలాంటి వ్యవసాయ యంత్రాల షాపులు గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పడటం వల్ల రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. రైతుల అభివృద్ధికి మరియు వ్యవసాయ రంగం పురోగతికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బత్తుల ఊశయ్య, సత్తయ్య, గడుసు శశిధర్ రెడ్డి, పాశం శ్రీనివాస్ రెడ్డి, గడ్డం పశుపతి, ప్రజ్ఞపురం సత్యనారాయణ, స్థానిక నాయకులు, రైతులు, ప్రజాప్రతినిధులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ స్టేడియంలో సంసద్ క్రీడ మహోత్సవం

**కరీంనగర్,మార్చి 6 (మహాప్రభ ).**
ఖేల్ ఇండియా కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ పట్టణంలోని అంబేద్కర్ స్టేడియంలో సంసద్ క్రీడ మహోత్సవం ఫైనల్ టోర్నమెంట్లు నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి, మానకొండూర్--హుజురాబాద్ నియోజకవర్గ ప్రముఖులు కనుమల్ల గణపతి, చెన్నమాధవిని నరసింహారాజు, గుర్రాల వెంకట్ రెడ్డి, ఆకుల రాజేందర్, నరెడ్ల చైతన్య రెడ్డి, చుక్కల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. క్రీడల ద్వారా యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

## రామక్కపేటలో వైభవంగా శ్రీ సీతారామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం

**దుబ్బాక -మార్చి 6 (మహాప్రభ ).**
రామక్క పేటలో రమ్యా మనోహరంగా శ్రీ సీతారామచంద్ర లక్ష్మణ, ఆంజనేయ విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం ప్రారంభం జరిగిందని ఆలయ కమిటీ చైర్మన్ సుశీకోజ్ మనోజ్ చారి పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండల పరిధిలోని శ్రీ సీతారామచంద్ర లక్ష్మణ, ఆంజనేయ విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం ప్రతిష్ట కార్యక్రమాలు మార్చు 06 శుక్రవారం నాడు గణపతి పూజలు మొదలుకొని వివిధ దేవత పూజలు అవహన అగ్ని ప్రతిష్ట, జాలాది వాసము, షీలా మూర్తులకు విశేష అభిషేకములు వివిధ పూజ హోమాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం గ్రామ ముదిరాజ్ సంఘం పెద్దమనిషిల సమక్షంలో శ్రీ సీతారాములయ కమిటీ 50 వేల నూట పదహారు రూపాయలు విరాళంగా ఆలయ మండపం, విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమాలపై అందజేశారు. హాయ్ ఈ సందర్భంగా శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ కమిటీ మెంబర్లు మాట్లాడుతూ అంగరంగ వైభవంగా రామనామ స్మరణతో విగ్రహ ప్రతిష్ట



కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని ఈ ఉత్సవ కార్యక్రమాలు నేటి నుండి మూడు రోజులపాటు ఆదివారం వరకు జరుగుతుందని ప్రతి ఒక్కరూ వచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతున్నాం. ఈ నిర్మాణం కు గ్రామ అన్ని కులాల పెద్దల ఐక్యమత్యంతో నిర్మాణానికి దాతల సహకారంతో రామాలయ నిర్మాణం కొనసాగుతుందని ఇంకెవరైనా దాతలు ఉంటే ముందుకు వచ్చి ఆలయ అభివృద్ధి సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఏ విగ్రహా ప్రతిష్టకు ఈ ఆలయ నిర్మాణానికి విరాళాలు అందించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదములు తెలుపుతున్న అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ కమిటీ వైస్ చైర్మన్ పెంబర్తి భాస్కర్, సభ్యులు గొడుగు వెంకటేశ్వర్, గ్రామ సర్పంచ్ కొండ డాక్టర్ విటోబా, గ్రామ అన్ని కులాల పెద్దలు వివిధ యువజన సంఘాల సభ్యులు, రామభక్త బృందం పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక విజయవంతం కావాలి

### జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

**నల్లగొండ, మార్చి 6 (మహాప్రభ ).**
ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ నల్లగొండ లైన్‌వాడ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని సందర్శించారు. పేదవారికి నిపుణులైన వైద్యులచే ప్రత్యేక వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మార్చి 6 నుండి 31 వరకు జిల్లాలోని అన్ని పీహెచ్‌సీలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ఒకరోజు ఆరు రకాల వైద్య సేవలు అందిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. డెంటల్, ఓబీజీ, ఆర్తో, ఆప్తమాలజీ, పీడియాట్రిషన్ వైద్యులచే పరీక్షలు నిర్వహించడంతో పాటు ఉచిత మందులు, తదుపరి వైద్య సేవలు అందిస్తున్నారని వివరించారు. రోగులు ఆన్లైన్లో రిజిస్ట్రేషన్ చేసుకుని ప్రత్యేక ఐడి నంబర్ పొందడం ద్వారా భవిష్యత్తులో కూడా వైద్య సేవలు పొందగలరని చెప్పారు. స్పెషలిస్ట్ వైద్యులు ప్రతిరోజు రెండు--మూడు



పీహెచ్‌సీలను కవర్ చేస్తూ అన్ని కేంద్రాల్లో సేవలు అందించనున్నారని తెలిపారు. ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా శుక్రవారం నుండి అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలు, గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలలో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టడంతో పాటు ఫైళ్ల పరిష్కారం కూడా చేయనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు అందరి సమన్వయం, సహకారంతో 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక విజయవంతం కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లైన్‌వాడ పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన ఆప్తమాలజీ, ఆర్తో, డెంటల్, ఇతర కౌంటర్లను పరిశీలించి రోగులతో ముఖాముఖి మాట్లాడారు. వారి సమస్యలను విని పరిష్కారం కోసం వైద్యులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, డిప్యూటీ డిఎంహెచ్‌ఓ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్ నేత నరసింహారావు, జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, లైన్‌వాడ యూపీహెచ్‌సీ డాక్టర్ ఇఫ్టేయార్, కార్పొరేటర్ మహమ్మద్ ఖాజా సమయుద్దిన్ నదీమ్, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకాన్ని కాపాడాలని డిమాండ్

**అచ్చంపేట, మార్చి 6 (మహాప్రభ ).**
నాగర్కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం గుంపల్లి గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో సమావేశం నిర్వహించిన తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వర్ధం సైదులు, పేద ప్రజల పొట్ట కోసేలా ఉపాధి హామీ పథకాన్ని దూరం చేయొద్దని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పథకాల పేర్లు మార్చడం కాదు, పేద ప్రజల బ్రతుకులు మార్చాలని కోరారు. ఉపాధి హామీ కూలీలకు మూడు నెలల బిల్లులు తక్షణమే చెల్లించి వారిని ఆదుకోవాలని సూచించారు. ఉపాధి హామీ పథకం లేకుంటే గ్రామీణ ప్రాంతాల్లో కూలీలు ఎలా బ్రతుకుతారని ప్రశ్నించారు. మహాత్మా గాంధీ ఉపాధి హామీ




పథకానికి భరోసా ఉన్నప్పటికీ, కొత్త పథకాలలో భద్రత లేదని విమర్శించారు. సైదులు మాట్లాడుతూ, అప్పటి ఎన్డీఏ ప్రభుత్వంలో కమ్యూనిస్టులు గ్రామాల్లో వలసలు నివారించేందుకు పోరాడి వందరోజుల ఉపాధి పథకానికి శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. నేటి కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం పథకాలకు తూట్లు పొడవడం సరైన పద్ధతి కాదని అన్నారు. ప్రతి సంవత్సరం కనీసం రూ. 2.50 వేల కోట్లు నిధులు కేటాయించాలని, పని దినాలను 200 రోజులకు పెంచాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రోజుకు రూ. 800 కూలి చెల్లించాలని డిమాండ్ చేశారు. పనిచేసే ప్రదేశాల్లో కూలీలకు త్రాగునీరు, టెంట్, పనిముట్లు, అత్యవసర మెడికల్ కిట్ అందుబాటులో ఉంచాలని ప్రభుత్వ అధికారులను కోరారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం సభ్యులు, ఉపాధి కూలీలు శ్రీకాంత్, రాజు, మోహన్, దేవి, పార్వతి, ఉపాధ్యాయ రాజు, దేవులీ వెంకట్ నాయక్, రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక సన్నాహక సమావేశం


**కరీంనగర్, మార్చి 6 (మహాప్రభ ).**
కరీంనగర్‌లో జరిగిన ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక సన్నాహక సమావేశంలో మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కరీంనగర్‌లో నెలకొని ఉన్న



సమస్యలను పరిష్కరించాల్సిందిగా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్‌లకు విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వ హయాంలో జర్నలిస్టులకు కేటాయించిన నివాస స్థలాలపై ఉన్న ఆంక్షలను తొలగించి, వారికి నిర్మాణ అనుమతులు ఇవ్వాలని మంత్రులకు వినతిపత్రం అందజేశారు.

# బిజినెస్

## భారీగా తగ్గిన బంగారం, వెండి ధరలు.. 22, 24 క్యారెట్ల తాజా రేట్లు ఇవి



దేశవ్యాప్తంగా బంగారం, వెండి ధరల్లో గత కొన్ని రోజులుగా హెచ్చుతగ్గులు కనిపిస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులు, డాలర్ విలువ మార్పులు, మధ్యప్రాచ్య ప్రాంతంలో ఉన్న భౌగోళిక ఉద్రిక్తతల ప్రభావంతో ఈ విలువైన లోహాల ధరలు తరచుగా మారుతున్నాయి. తాజాగా శుక్రవారం భారత బులియన్ మార్కెట్‌లో బంగారం ధరలు కొంత తగ్గగా, వెండి ధరల్లో కూడా స్వల్ప మార్పులు నమోదయ్యాయి. హైదరాబాద్ మార్కెట్‌ను తీసుకుంటే, శుక్రవారం 24 క్యారెట్ల బంగారం 10గ్రాముల ధర రూ.1,62,870, 22 క్యారెట్ల ధర రూ.1,49,290 లు ధర పలుకుతోంది.

దేశంలోని ప్రధాన నగరాలు, పట్టణాల్లో బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయో ఇక్కడ తెలుసుకుందాం...

-- చెన్నైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,64,940 లు ఉండగా.. 22 క్యారెట్ల ధర రూ.1,51,190 గా ఉంది.

-- ముంబైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,62,870, 22 క్యారెట్ల ధర రూ.1,49,290 గా ఉంది.

-- ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,63,020 క్యారెట్ల ధర రూ.1,49,440 గా ఉంది.

-- కోల్‌కతాలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,62,870, 22 క్యారెట్ల ధర రూ.1,49,290 గా ఉంది.

-- బెంగళూరులో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,62,870, 22 క్యారెట్ల ధర రూ.1,49,290 గా ఉంది.

-- హైదరాబాద్‌లో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,62,870, 22 క్యారెట్ల ధర రూ.1,49,290 గా ఉంది.

-- విజయవాడలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,62,870, 22 క్యారెట్ల ధర రూ.1,49,290 గా ఉంది.

-- విశాఖపట్నంలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,62,870, 22 క్యారెట్ల ధర రూ.1,49,290 గా ఉంది.

ఇక వెండి ధర విషయానికి వస్తే, భారత్‌లో గ్రాము వెండి ధర రూ.294.90లుగా ఉంది. అంటే 10 గ్రాముల వెండి ధర రూ. 2,94,900 వద్ద ట్రేడవుతోంది. అంతర్జాతీయ మార్కెట్లలో వెండి ధరల మార్పుల కారణంగా దేశీయ మార్కెట్‌లో కూడా ధరలు తరచూ మారుతున్నాయి.

## రాయల్ ఎన్‌ఫీల్డ్ ప్రియులకు శుభవార్త.. ఈ నెలలో మరో పవర్‌ఫుల్ బైక్..!



రాయల్ ఎన్ఫీల్డ్ 450సిసి లైనప్‌లో హిమాలయన్ 450, గెరిల్లా 450 ఉన్నాయి. గెరిల్లా 450 మొదట 2024లో ప్రారంభించింది. కంపెనీ ఇప్పుడు మోటార్‌సైకిల్ అప్‌డేట్ వెర్షన్‌ను దేశానికి తీసుకురావాలని యోచిస్తోంది. కంపెనీ ఈ మోటార్‌సైకిల్‌ను మార్చి 2026 చివరి నాటికి విడుదల చేయనుంది. మోటార్‌సైకిల్ ప్రారంభించిన తర్వాత ఇది మొదటి అప్‌డేట్ అవుతుంది. కొన్ని ముఖ్యమైన మార్పులను కలిగి ఉంటుందని భావిస్తున్నారు.ప్రస్తుతానికి రాయల్ ఎన్‌ఫీల్డ్ అప్‌డేట్ వివరాలు, రైడర్ అనుభవానికి తీసుకువచ్చే మార్పుల గురించి పెద్దగా వెల్లడించలేదు. బ్రాండ్ గత నమూనాను పరిశీలిస్తే, గేర్‌బాక్స్‌లో కొన్ని మార్పులు చేసే అవకాశం ఉంది. భారతదేశంలో హంటర్ 350 అప్‌డేట్ చేసిన వెర్షన్‌లో కూడా ఇలాంటి మార్పు కనిపించింది. ఈ మార్పులు ప్రధానంగా రైడర్ సౌకర్యం, మోటార్‌సైకిల్ నియంత్రణను మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకున్నాయి.

**కొత్త కలర్స్ ఆప్షన్:**

అదేవిధంగా కంపెనీ కొన్ని మార్పులు చేయవచ్చు. ఈ మార్పులు కొత్త రంగు ఎంపికలతో పాటు, దాని రూపాన్ని కూడా మెరుగుపరుస్తాయి. ప్రస్తుతం ఈ బైక్ బ్రావా బ్లూ, షాడో యాష్, పీక్స్ బ్రాంజ్, స్మోక్ సిల్వర్, ప్లేయా బ్లాక్, గోల్డ్ డిప్ రంగులలో లభిస్తుంది. రాయల్ ఎన్ఫీల్డ్ గెరిల్లా 450 రూ.2.56 లక్షల నుండి (ఎక్స్-షోరూమ్) ప్రారంభమవుతుంది. ఇది షెర్పా ఇంజిన్‌తో పనిచేస్తుంది. ఇది హిమాలయన్ 450కి కూడా శక్తినిస్తుంది. ఈ 452cc, లిక్విడ్-కూల్డ్, సింగిల్-సిలిండర్ ఇంజిన్ 40 హార్స్‌పవర్, 40 Nm పీక్ టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఇది రైడ్-బై-వైర్ సిస్టమ్, రెండు రైడింగ్ మోడ్‌లతో ఆరు-స్పీడ్ గేర్‌బాక్స్‌తో జత చేసింది. ఈ మోటార్ సైకిల్ లో 43mm టెలిస్కోపిక్ ఫ్రంట్ ఫోర్కులు ఉన్నాయి. ఇవి 140mm వీల్ ట్రావెల్ ను అందిస్తాయి. వెనుక భాగంలో 150ఎం మోనో-షాక్ సస్పెన్షన్ కూడా ఉంది. ముందు భాగంలో డ్యూయల్-పిస్టన్ కాలిపర్‌తో కూడిన 310mm వెంటిలేటెడ్ డిస్క్ బ్రేక్, వెనుక భాగంలో 270mm సింగిల్-పిస్టన్ డిస్క్ బ్రేక్ బ్రేకింగ్‌ను నిర్వహిస్తాయి. భద్రత కోసం డ్యూయల్-ఛానల్ ABS కూడా చేర్చింది. బైక్ 17-అంగుళాల చక్రాలపై నడుస్తుంది.

## సింగిల్ చార్జింగ్‌తో 950 కిలోమీటర్లు

సరికొత్త ఈవీ మోడల్‌ను తీసుకొచ్చిన బీవైడీ

**న్యూఢిల్లీ,**

: చైనాకు చెందిన ఈవీల తయారీ సంస్థ బీవైడీ..మార్కెట్లోకి సరికొత్త ఎలక్ట్రిక్ ఎస్‌యూవీని అందుబాటులోకి తీసుకొచ్చింది. బీవైడీ గ్రేట్ టంగ్ పేరుతో విడుదల చేసిన ఈ కారు సింగిల్ చార్జింగ్‌తో 950 కిలోమీటర్లు ప్రయాణించింది.ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా లభిస్తున్న కార్లలో ఇదే అత్యధిక మైలేజీ ఇచ్చే కారు కావడం విశేషం. ధర ఇతర వివరాలు సంస్థ వెల్లడించలేదు. ఏడుగురు కూర్చోవడానికి వీలుండే విధంగా డిజైన్ చేసిన ఈ కారు ఇతర వివరాలు సంస్థ వెల్లడించలేదు. గంటకు 250 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోనున్నది.



# స్పోర్ట్స్

## మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ నాకు కాదు.. అతనికి ఇవ్వాలి

**ముంబై**


టీ20 వరల్డ్‌కప్‌లో ఇంగ్లండ్‌తో జరిగిన సెమీఫైనల్లో ఇండియా ఉత్కంఠ విజయాన్ని నమోదు చేసిన విషయం తెలిసిందే. పరుగుల ప్రవాహం సృష్టించిన ఆ మ్యాచ్‌లో ఇండియా ఏడు పరుగుల తేడాతో నెగ్గింది. ఫస్ట్ బ్యాటింగ్ చేసిన ఇండియా ఏడు వికెట్ల నష్టానికి 253 రన్స్ చేసింది. అయితే బ్యాటర్ సంజూ శాంసన్(ఝఅఝఙ ఝఎంశీఅ) కేవలం 42 బంతుల్లో 89 రన్స్ చేసి కీలక ఇన్నింగ్స్ ఆడాడు. వాంఖడే స్టేడియంలో బౌండరీల మోత మోగించాడు. అతని ఇన్నింగ్స్‌లో 8 ఫోర్లు, ఏడు సిక్సర్లు ఉన్నాయి. నువ్వా నేనా అన్నట్లుగా సాగిన మ్యాచ్‌లో ఇంగ్లండ్ ఆఖరి వరకు పోరాడింది. ఇంగ్లండ్ ఏడు వికెట్ల నష్టానికి 246 రన్స్ చేసి ఏడు పరుగుల తేడాతో ఓటమి పాలైంది. ఇంగ్లండ్ బ్యాటర్ బెథేల్ సూపర్ సెంచరీ కొట్టాడు. 48 బంతుల్లో 8 ఫోర్లు, ఏడు సిక్సర్లతో 105 రన్స్ చేసి




ఔటయ్యాడు.అయితే భారత్ ఇన్నింగ్స్‌లో అత్యధిక రన్స్ చేసిన సంజూ శాంసన్‌కు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది. ఆ అవార్డు అందుకున్న తర్వాత సంజూ మాట్లాడుతూ.. ఈ అవార్డు తనకు దక్కాల్సింది కాదన్నారు. భారత జట్టు విజయంలో బౌలర్ బుమ్రా కీలక పాత్ర పోషించినట్లు పేర్కొన్నారు. గెలుపు క్రెడిట్ బుమ్రాకే దక్కుతుందని, అతనో ప్రపంచ మేటి బౌలర్ అని, తరానికి ఓసారి అలాంటి ఆటగాడు దొరుకుతారని, సెమీస్ మ్యాచ్‌లో అద్భుతంగా బౌలింగ్ చేశాడని, ఈ అవార్డు వాస్తవానికి ఆయనకే దక్కాలని అన్నారు. డెత్ ఓవర్లలో బుమ్రా వేసిన బౌలింగ్ తీరు ప్రత్యేకమైందని, ఒకవేళ అలా బౌలింగ్ చేయకుంటే, బహుశా తాను ఇక్కడ నిలబడేవాడిని కాదన్నారు. ఈ విజయంలో బౌలర్లకే క్రెడిట్ దక్కుతుందన్నారు. కఠినమైన పరిస్థితుల్లో ఉత్తమంగా రాణించారన్నారు. ఇన్నింగ్స్ 18వ ఓవర్‌లో బుమ్రా యార్కర్లతో ఇంగ్లండ్ బ్యాటర్లను అడ్డుకున్నాడు. కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి తక్కువ పరుగులు ఇచ్చాడు. ఇండియా విక్టరీలో ఆ ఓవర్ అత్యంత కీలకంగా మారింది.

## అక్షర్ అద్భుతః.. బౌండరీ వద్ద కళ్లు చెదిరే క్యాచ్..

పొట్టి ప్రపంచకప్ కీలక మ్యాచ్‌లో భారత వైస్ కెప్టెన్ అక్షర్ పటేల్ మైదానంలో అద్భుతం చేశాడు. సెమీఫైనల్లో టామ్ బ్యాంటన్‌ను క్లీన్‌బౌల్డ్ చేసిన అక్షర్.. కళ్లు చెదిరే క్యాచ్‌తో బిగ్ వికెట్ అందించాడు. అర్ష్‌దీప్ సింగ్ వేసిన 14వ ఓవర్ చివరి బంతికి విల్ జాక్స్(35) పెద్ద షాట్ ఆడగా.. పరుగెడుతూ వెళ్లిన అక్షర్ పటేల్ బంతిని అందుకున్నాడు. బ్యాలెన్స్ తప్పి బౌండరీ లైన్‌కు తాకుతున్నట్టు గమనించిన అతడు.. అప్రమత్తమై బంతిని శివం దూబే వైపు విసిరాడు. దూబే కూల్‌గా బంతిని అందుకోవడంతో డేంజరస్ జాక్స్ ఔటయ్యాడు. అంత.. భారత డగౌట్, స్టేడియంలోని అభిమానులు సంబరాల్లో మునిగిపోయారు.భారత్ నిర్దేశించిన 254 పరుగుల ఛేదనలో 95కే ఇంగ్లండ్ నాలుగు వికెట్లు



పడ్డాయి. ఆ దశలోప్రత్యర్థిని టీమిండియా చిత్తు చేయడం ఖాయమనుకున్నారంతా. కానీ, జాకబ్ బెథెల్(105)కు తోడుగా.. విల్ జాక్స్(35) చెలరేగాడు. దాంతో.. ఇంగ్లండ్ లక్ష్యానికి చేరువ కాసాగింది. ఆ సమయంలో 14వ ఓవర్ వేసిన అర్ష్‌దీప్. మూడు వైడ్లతో ఆందోళన కలిగించాడు. కానీ, జాక్స్‌ను ఊరిస్తూ అతడు వేసిన చివరి బంతిని అక్షర్ పటేల్ బౌండరీ వద్ద మెకళ్లు చెదిరే విధంగా క్యాచ్ అందుకున్నాడు.బౌండరీని తాకేలోపే.. బంతిని దూబే చేతికి అందించి.. జాక్స్ వికెట్ తీయడంలో కీలమయ్యాడు. అతడు అప్పటివరకూ బెథెల్‌తో కలిసి బౌండరీల మోతతో ఇంగ్లండ్ స్కోర్ బోర్డును ఉరికించిన జాక్స్ ఔటవ్వడంతో మ్యాచ్ భారత్ వైపు తిరిగింది. చివరి ఓవర్లో 30 పరుగులు అవసరమవ్వగా.. తొలి బంతికే బెథెల్ రనౌట్ కావడంతో ఇంగ్లండ్ ఓటమి ఖాయమైంది. చివరి మూడు బంతుల్లో ఆర్చర్ సిక్సర్లు రాబట్టినా.. 7 పరుగులతో గెలుపొందిన సూర్యకుమార్ సేన ఫైనల్‌లో అడుగుపెట్టింది.

## టీమిండియాలో వాడు మా జట్టులో ఉంటే బాగుండేది.



టీ20 ప్రపంచకప్ 2026 సెమీఫైనల్‌లో ఇంగ్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో టీం ఇండియా ఏడు పరుగుల తేడాతో అద్భుత విజయం సాధించి ఫైనల్‌కు దూసుకుపోయింది. ఈ మ్యాచ్‌కు ముందు పాకిస్తాన్ మాజీ క్రికెటర్లు రషీద్ లతీఫ్, మహమ్మద్ అమీర్, షాహిద్ అఫ్రీదీ వంటి వారు టీం ఇండియా గెలవదని ప్రిడిక్షన్స్ చేశారు. వారి సొంత జట్టు పాకిస్తాన్ గ్రూప్ దశ నుంచే నిష్క్రమించిన నేపథ్యంలో, తమ జట్టు లోపాలను సరిచేసుకోకుండా భారత్‌పై ప్రతికూల వ్యాఖ్యలు చేశారు.వాంఖడే స్టేడియంలో గురువారం జరిగిన ఉత్కంఠభరితమైన ఈ మ్యాచ్‌లో, ఇంగ్లాండ్ బ్యాటర్ జాకబ్ బెథెల్ 105 పరుగులతో పోరాడినప్పటికీ, టీం ఇండియా విజయాన్ని సొంతం చేసుకుంది. మ్యాచ్ ఆఖర్లో జస్ ప్రీత్ బుమ్రా, హార్దిక్ పాండ్య అద్భుతంగా బౌలింగ్ చేసి భారత్‌కు విజయాన్ని అందించారు.టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్ చేసిన టీం ఇండియాలో అభిషేక్ శర్మ మినహా ప్రతి బ్యాట్స్‌మెన్ పరుగులు రాబట్టారు. ముఖ్యంగా సంజూ శాంసన్ వరుసగా రెండో హాఫ్ సెంచరీ నమోదు చేసి, ఇంగ్లాండ్ బౌలర్లను ఒత్తిడిలోకి నెట్టాడు. బౌలింగ్‌లో టీం ఇండియా ఒక దశలో వెనుకబడినట్లు కనిపించినా, బుమ్రా, హార్దిక్ పాండ్య కీలక సమయాల్లో రాణించి జట్టును కాపాడారు.ఈ విజయంపై స్పందించిన పాకిస్తాన్ మాజీ కెప్టెన్ షాహిద్ అఫ్రీది, ఒత్తిడిలో ఎలా రాణించాలో టీం ఇండియాను చూసి ఇతర జట్లు నేర్చుకోవాలని పేర్కొన్నారు. తమ జట్టు కూడా భారత్ నుంచి నేర్చుకోవాలన్నారు. ముఖ్యంగా, బుమ్రా పరుగులను అద్భుతంగా నియంత్రించాడని అఫ్రీది ప్రశంసించారు. తన అల్లుడైన షాహీన్ అఫ్రీదీ ఇలాంటి స్పెల్ వేసి ఉంటే, పాకిస్తాన్ శ్రీలంకపై అధిక నెట్ రన్ రేట్‌తో సెమీస్‌లోకి ప్రవేశించేదని అఫ్రీది అభిప్రాయపడ్డారు. బ్యాటింగ్ పిచ్‌పై బుమ్రా బౌలింగ్ అద్భుతమని ఆయన కొనియాడారు.అయితే, షాహిద్ అఫ్రీది తన వైఖరిని మార్చుకోకుండా, ఫైనల్‌లో టీం ఇండియా ఓడిపోతుందని మరో ప్రిడిక్షన్ చేశారు. టీం ఇండియా కంటే న్యూజిలాండ్ చాలా బలంగా ఉందని ఆయన వ్యాఖ్యానించారు. మొత్తంగా చూస్తే, టీం ఇండియా ఈ కప్పును గెలవడం పాకిస్తాన్ మాజీ ఆటగాళ్లకు ఇష్టం లేనట్లు కనిపిస్తుంది. ప్రతి ఒక్క మాజీ ఆటగాడు టీం ఇండియా ఓడిపోవాలని కోరుకుంటున్నారు. అయితే, వారి ప్రిడిక్షన్లకు విరుద్ధంగా టీం ఇండియా వరుస విజయాలతో ఫైనల్‌కు చేరింది.

నమస్తే మహాప్రభ



బేబీ బ్యూటీ వైష్ణవి.. స్టన్నింగ్ లుక్ లో కేక సొగసులు..





# జాన్వీ కపూర్ బర్త్‌డే..
# ‘పెద్ది’ నుంచి స్పెషల్ వీడియోను పంచుకున్న టీమ్

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ చిత్రం ‘పెద్ది’ . ఈ సినిమాలో కథానాయికగా నటిస్తున్న బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ నిన్న తన 29వ పుట్టినరోజును జరుపుకుంటున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని చిత్ర యూనిట్ ఆమెకు బర్త్‌డే విషెస్ తెలుపుతూ ఒక స్పెషల్ వీడియోను విడుదల చేసింది.కాటుక అక్కర్లేని ఆ కళ్లు, ముక్కుపుడక అక్కర్లేని ఆ ముక్కు.. అంటే అలంకరణ అక్కర్లేని అరుదైన చికిరియే ఈ చికిరి.. అంటూ దర్శకుడు బుచ్చిబాబు సనా జాన్వీని ప్రశంసిస్తూ ఉన్న ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ సినిమాలో జాన్వీ ‘అచ్చియమ్మ’ అనే పల్లెటూరి యువతి పాత్రలో నటిస్తుంది. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తుండగా, మైత్రీ మూవీ మేకర్స్ సహకారంతో వృద్ధి సినిమాస్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఇప్పటికే షూటింగ్ చివరి దశకు చేరుకున్న ఈ చిత్రం ఏప్రిల్ 30, 2026న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.



### ప్రేమ వివాహం చేసుకోనున్న
# బెల్లంకొండ శ్రీనివాస్!
### ఈ వారంలోనే ఎంగేజ్మెంట్? అమ్మాయి ఎవరంటే?




తెలుగు సినిమా ఇండస్ట్రీలో ప్రస్తుతం పెళ్లిళ్ల సందడి నెలకొంది. సినిమా తారలు ఒక్కొక్కరూ వరుసగా పెళ్లిపీటలెక్కనున్నారు. ఇప్పటికే విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నాల వివాహం గ్రాండ్ గా జరిగింది. ఇవాళ (మార్చి 06) అల్లు అరవింద్ చిన్న కుమారుడు అల్లు శిరీశ్- నయనికల పెళ్లి వేడుక జరగనుంది. ఇప్పుడు మరో యంగ్ హీరో పెళ్లికి రెడీ అవుతున్నాడు. టాలీవుడ్ టాప్ ప్రొడ్యూసర్ బెల్లంకొండ సురేష్ కొడుకు హీరో బెల్లంకొండ శ్రీనివాస్ కూడా తన బ్యాచిలర్ లైఫ్ కు బై బై చెప్పనున్నాడని సమాచారం. తను ప్రేమించిన అమ్మాయితో త్వరలోనే కొత్త జీవితం ప్రారంభించనున్నాడని టాక్. బెల్లం కొండ శ్రీనివాస్ గత కొన్నేళ్లుగా కావ్యా రెడ్డి అనే అమ్మాయితో ప్రేమలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇరు పెద్దలు కూడా వీరి ప్రేమను ఆశీర్వదించడంతో ఆదివారం (మార్చి 8) న వీరి నిశ్చితార్థం జరగనున్నట్లు సమాచారం. కేవలం ఇరు కుటుంబ సభ్యులు, స్నేహితులు, సన్నిహితుల సమక్షంలో శ్రీనివాస్- కావ్య లు ఉంగరాలు మార్చుకోనున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే శ్రీనివాస్ పెళ్లిపై ఒక అధికారిక ప్రకటన వెలువడనుందని సమాచారం. బెల్లంకొండ శ్రీనివాస్ కు కాబోయే భార్య కావ్యా రెడ్డిది కూడా హైదరాబాదేనట. అయితే సినిమా ఇండస్ట్రీలో ఆమెకు ఎలాంటి సంబంధాలు లేవట. కావ్య తండ్రి ఓ ప్రముఖ లాయర్ అని సమాచారం. శ్రీనివాస్- కావ్యల పరిచయం ఎలా మొదలైంది? ఎప్పుడు ప్రేమలో పడ్డారు? అన్న విషయాలు తెలియలేదు కానీ.. ఇరు పెద్దలు వీరి ప్రేమకు పచ్చజెండా ఉపారని సమచారం. ఈ ఏడాది చివరిలో వీరి పెళ్లి జరగనుందని తెలుస్తోంది. ఎంగేజ్మెంట్ తర్వాత శ్రీనివాస్ పెళ్లిపై ఓ క్లారిటీ వచ్చే అవకాశముంది ‘అల్లుడు శీను’ మూవీతో ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చాడు బెల్లంకొండ శ్రీనివాస్. ఆ తర్వాత స్పీడున్నోడు, జయ జానకీ నాయక, సాక్ష్యం, కవచం, సీత, రాక్షసుడు, అల్లుడు అదుర్స్, ఛత్రపతి (హిందీ రీమేక్), భైరవం, కిష్కింధ పురి తదితర సినిమలతో మంచి సక్సెస్ లు అందుకున్నాడు. ప్రస్తుతం ఈ యంగ్ హీరో చేతిలో పలు క్రేజీ ప్రాజెక్టులు ఉన్నాయి. టైసన్ నాయుడు, హైందవతో పాటు మరికొన్ని సినిమాల్లో నటిస్తున్నాడు బెల్లంకొండ.

# సుశాంత్‌తో ప్రేమ
### గాసిప్స్‌పై మీనాక్షి చౌదరి క్లారిటీ

ప్రస్తుతం టాలీవుడ్‌లో పెళ్లిళ్ల సందడి ఎక్కువగా కనిపిస్తోంది. ఇటీవల విజయ్-రష్మిక వివాహం వార్తల్లో నిలిచిన సంగతి తెలిసిందే. అలాగే మార్చి 6న అల్లు శిరీష్-- నయనిక రెడ్డి వివాహం జరగనుండటంతో సినీ వర్గాల్లో పెళ్లి వార్తలు హాట్ టాపిక్‌గా మారాయి. ఇదే సమయంలో హీరోయిన్ మీనాక్షి చౌదరి వ్యక్తిగత జీవితంపై కూడా కొన్ని గాసిప్స్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె వాటిపై స్పష్టత ఇచ్చారు. తన అందం, నటనతో తక్కువ సమయంలోనే మంచి గుర్తింపు సంపాదించిన హీరోయిన్లలో మీనాక్షి చౌదరి ఒకరు. ఆసక్తికర విషయం ఏమిటంటే, చాలా మంది నటీనటులు డాక్టర్ అవ్వాలని అనుకుని సినిమాల్లోకి వచ్చామని చెబుతుంటారు. కానీ మీనాక్షి మాత్రం నిజంగానే డెంటిస్ట్ చదివి తర్వాత సినిమా రంగంలోకి అడుగుపెట్టారు.మొదట మోడలింగ్‌తో కెరీర్ ప్రారంభించిన ఆమె, తర్వాత వచ్చిన అవకాశాలను ఉపయోగించుకుంటూ సినిమాల్లో ముందుకు సాగారు. 2019లో వచ్చిన హిందీ సినిమా అప్‌స్టార్ట్స్ ద్వారా మొదటిసారి తెరపై కనిపించిన మీనాక్షి, 2021లో వచ్చిన ఇచ్చట వాహనాలు నిలుపరాదు సినిమాతో తెలుగులోకి ఎంట్రీ ఇచ్చారు. ఆ తర్వాత ఖిలాడీ, హిట్: ది సెకండ్ కేసు, గుంటూరు కారం వంటి చిత్రాల్లో నటిస్తూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ముఖ్యంగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో వచ్చిన లక్కీ భాస్కర్ ఆమెకు మంచి పేరు తెచ్చింది. అలాగే వెకంటేష్‌తో కలిసి చేసిన సంక్రాంతికి వస్తున్నాం కూడా మంచి విజయాన్ని అందుకుంది. తెలుగు మాత్రమే కాకుండా తమిళంలో కూడా ఆమె పలు సినిమాల్లో నటించారు. ప్రస్తుతం కార్తీక్ దండు దర్శకత్వంలో నాగ చైతన్య హీరోగా నటిస్తున్న ‘వృషకర్మ’ సినిమాలో మీనాక్షి హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన ఆమె లుక్ ఇప్పటికే సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇదిలా ఉండగా, కొంతకాలంగా మీనాక్షి చౌదరి ఒక తెలుగు హీరోతో రిలేషన్‌లో ఉన్నారని గాసిప్స్ వినిపించాయి. ఆ హీరో మరెవరో కాదు సుశాంత్. వీరిద్దరూ కలిసి నటించినఇచ్చట వాహనాలు నిలుపరాదు సినిమా షూటింగ్ సమయంలో స్నేహం పెరిగి అది ప్రేమగా మారిందని అప్పట్లో ప్రచారం జరిగింది. అయితే ఈ వార్తలపై తాజాగా స్పందించిన మీనాక్షి, వాటిని పూర్తిగా ఖండించారు. సుశాంత్‌తో తనకు ప్రేమ సంబంధం లేదని, అతను మంచి స్నేహితుడు మాత్రమేనని స్పష్టం చేశారు. ఈ విషయంపై గాసిప్స్ ఎక్కువ కావడంతో మీనాక్షి టీమ్ కూడా స్పందించి ఇద్దరూ కేవలం ఫ్రెండ్స్ మాత్రమేనని క్లారిటీ ఇచ్చింది.

# రీల్స్ పేరుతో ఇలాంటి
# ఫోటోస్ తీస్తారా..



రుక్మిణి వసంత్.. ప్రస్తుతం సౌత్ ఇండస్ట్రీలో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్. సప్త సాగరాలు దాటి సినిమాతో ఒక్కసారిగా ఫేమస్ అయిన ఈ అమ్మడు..ఇప్పుడు టాప్ హీరోల సరసన వరుస అవకాశాలు దక్కించుకుంటూ ముందుకు వెళ్తుంది. కాంతార చాప్టర్ 1 సినిమాతో పాన్ ఇండియా లెవల్లో ఫేమస్ అయ్యింది.ప్రస్తుతం చేతినిండా సినిమాలతో బిజీగా ఉన్న ఆమె.. రాంగ్ యాంగిల్ ఫోటోలను తీసి సోషల్ మీడియాలో షేర్ చేసే ఫోటోగ్రాఫర్స్ పై సీరియస్ అయ్యారు. హీరోయిన్స్ విషయంలో రాంగ్ యాంగిల్స్ లో ఫోటోస్ తీసి రీల్స్ పేరుతో అన్ పాపులర్ చేసే ప్రైవేట్ ఫోటోగ్రాఫర్స్ తీరుపై మండిపడ్డారు.తన ట్విట్టర్ ఖాతాలో దీని గురించి పేర్కొంటూ హీరోయిన్లను కించపరిచే విధంగా ప్రవర్తించే ఫోటోగ్రాఫర్స్ చర్యలను ఖండించాల్సిన విషయమని అన్నారు. ఇలాంటి ఘటనలపై చర్యలు తీసుకోవడానికి తాము ఒక గ్రూప్ ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు.తాను వృత్తిలో భాగంగా నటించడానికి వేస్తున్నామని.. అదే వఇధంగా ఇతర కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు. అలాంటి సమయాల్లో తమను రాంగ్ యాంగిల్ చిత్రీకరించే కొందరు ప్రైవేట్ ఫోటోగ్రాపర్స్ చర్యలు తీవ్రంగా ఖండిస్తామని పేర్కొన్నారు.నటీమణులను కించపరిచే వారిపై చర్యలు తీసుకోవడానికి వెనుకడామని అన్నారు . మరోవైపు ఇదివరకే హీరోయిన్ సప్తమి గౌడ సైతం ఫోటోగ్రాఫర్స్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. తమ శరీరాలను జూమ్ చేసి మరీ ఫోటోస్ తీయొద్దని అన్నారు.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com